Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 333 మేడ్చల్ మల్కాజ్‌గిరి 22 డిసెంబర్ 2023 శుక్రవారం పేజీలు : 4

## కరోనా హాట్ స్పాట్‌గా గోవా?

### పెరుగుతున్న కేసులతో న్యూఇయర్ సెలబ్రేషన్లపై నీలినీడలు

ఢిల్లీ: దేశంలో JN.1 వేరియంట్ కేసుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. తాజాగా 21 కరోనా కేసులు నమోదయ్యాయి. సదరు వేరియంట్ వేగంగా వ్యాప్తి చెందే స్వభావం కలిగి ఉందని డాక్టర్లు చెబుతున్నారు. తాజాగా నమోదైన 21 కేసుల్లో 19 గోవాలోనే ఉండటం ఆ రాష్ట్రం కరోనాకి హాట్ స్పాట్ గా మారిందా? అనే అనుమానాలను కలిగిస్తోంది. కేసుల్లో కేరళ, మహారాష్ట్రల్లో ఒక్కొక్కటి చొప్పున నమోదయ్యాయి. గోవాలోనే కేసుల వృద్ధి ఎక్కువగా ఉండటం గమనార్హం. నూతన సంవత్సర వేడుకలు సిద్ధమవుతున్న దేశ ప్రజలకు కరోనా కేసుల పెరుగుదల అడ్డంకిగా మారింది. వైరస్ ఉద్ధృతి తగ్గకపోతే ప్రభావిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఆంక్షలు అమలు చేసే అవకాశం ఉంది.

# సీఎం రేవంత్ దూకుడు

## కేసీఆర్ ఒప్పందాల పై విచారణకు రేవంత్ ఆదేశం..!!





హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ సంచలన నిర్ణయం ప్రకటించారు. కేసీఆర్ హయాంలో జరిగిన ఛత్తీస్ ఘడ్ తో జరిగిన విద్యుత్ ఒప్పందం మీద విచారణకు నిర్ణయించారు. జ్యుడిషియల్ విచారణకు శాసనసభలోనే రేవంత్ నిర్ణయం తీసుకున్నారు. విద్యుత్ పరిస్థితుల పైన ప్రభుత్వం సభలో శ్వేతపత్రం విడుదల చేసింది. ఈ చర్చలో భాగంగా మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి పైన మంత్రి కోమటిరెడ్డి సంచలన ఆరోపణలు చేసారు. వీటి పైన విచారణకు ఆదేశించాలని జగదీశ్వర్ ప్రభుత్వానికి సవాల్ చేసారు. న్యాయ విచారణకు నిర్ణయం : ఈ చర్చలో జోక్యం చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ గత ప్రభుత్వం విద్యుత్ సెంటిమెంట్ అస్త్రంగా మలచుకొని రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. ఆర్ధిక దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. ఛత్తీస్ ఘడ్ తో వెయ్యి మెగావాట్ల ఒప్పందం లోనే విద్యుత్ ఉపయోగించుకున్నా..ఉపయోగించుకోకున్నా డబ్బులు చెల్లించాలని ఉందని వివరించారు. ఈ ఒప్పందం వెనుక నాటి ప్రభుత్వ ఉద్దేశాలు ఏందో విచారణ లో తెలుతాయని వివరించారు. నాడు సభలో ప్రతిపక్ష పార్టీగా కాంగ్రెస్ వీటి పైన నిలదీసిందని..ప్రభుత్వం సమాధానం చెప్పకుండా తప్పించుకుందని చెప్పుకొచ్చారు.

**డైలాగ్ వార్ :** చర్చ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మధ్య వాడీ వేడీ చర్చ జరిగింది. ముందుగా యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులో పెద్ద కుంభకోణం జరిగిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఇందులో 10 వేల కోట్లను జగదీశ్ రెడ్డి తిన్నారని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై జగదీశ్ రెడ్డి ధీటుగా స్పందించారు. కోమటిరెడ్డి చేసిన ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో లేదా కమిషన్‌తో విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని జగదీశ్ రెడ్డి కోరారు. ఆ విచారణలో దోషులు దొరికితే వాళ్లకు శిక్ష వేయాలన్నారు. లేదంటే ఆధారాలు లేకుండా అసంబద్ధ ఆరోపణలు చేసిన వారికి శిక్ష పడాలన్నారు.

విద్యుత్ పై శ్వేతపత్రం : దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. మూడు అంశాలపై జ్యుడీషియల్ ఎంక్వైరీ చేసేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఆ విచారణతో పాటు.. కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన ఆరోపణలపై కూడా విచారణ చేయాలన్నారు. వారు చేసిన ఆరోపణలు అసంబద్ధమైతే తప్పకుండా శిక్ష పడాల్సిన అవసరం ఉందని పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి రేవంత్ నాటి ప్రభుత్వం 24 గంటల విద్యుత్ ఇవ్వలేదని స్పష్టం చేసారు. ప్రభుత్వం ప్రకటించిన శ్వేత పత్రంలో ప్రస్తుతం విద్యుత్ రంగం అప్పులు 81,016 కోట్లుగా ప్రభుత్వం శాసనసభా వేదికగా ప్రకటన చేసింది. విద్యుత్ రంగం సమస్యల్లో ఉందని వివరించింది. దీనిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఖండిస్తూ నాటి ప్రభుత్వంలో చేపట్టిన సంస్కరణలను వివరించారు.



## తెచ్చిన అప్పులతో ఎక్కడా నష్టం జరగలేదు.. ఆస్తులు పెంచాం : జగదీశ్ రెడ్డి

హైదరాబాద్ : దేశంలో 24 గంటల విద్యుత్‌ను అన్ని రంగాల వినియోగదారులకు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయాన్ని నీతి ఆయోగ్ తన స్టేట్ ఎనర్జీ అండ్ క్లైమెట్ ఇండెక్స్‌లో ప్రకటించిందని గుర్తు చేశారు. శాసన సభలో విద్యుత్ రంగంపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో విద్యుత్ పరిస్థితిని ఆయన వివరించారు. 2014 జూన్ 2 నాటికి విద్యుత్ సంస్థల ఆస్తులు 44,438 కోట్లు ఉంటే.. అప్పు 22,423 కోట్లు ఉండేదని జగదీశ్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు ఆ అప్పులు 81,016 కోట్లు అవ్వగా.. ఆస్తుల విలువ 1,37,570 కోట్లకు పెంచామని వివరించారు. తెచ్చిన అప్పుతో ఎక్కడా నష్టం జరగలేదని.. ఆస్తులు పెంచామని వివరించారు. ఆనాడు తెలంగాణ రాష్ట్రంలో పిల్లలకు పరీక్షలు వస్తున్నాయంటే.. పెద్దలకే పెద్ద పరీక్ష ఉండేదని గుర్తు చేశారు. పరీక్షలు వస్తున్నాయంటే.. కిరసనాయిల్ దేవులాడుకురావడం.. క్యాండిల్స్ కొనుక్కొచ్చుకునే పరిస్థితి ఉండేదన్నారు. ఒకప్పుడు పల్లెల్లో నీళ్లు కావాలంటే బోరుబావుల దగ్గరకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉండేదన్నారు. అలా బోరుబావి దగ్గరికి పోయాక కరెంటు పోతే.. రెండు గంటలా? మూడు గంటలా? నాలుగు గంటలా? ఎన్ని గంటలు అక్కడే ఉండాలో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. బిందెడు నీళ్లు లేకుండా ఇంటికి పోతే ఎసరు పెట్టే పరిస్థితి లేదని గుర్తు చేశారు. ఆనాడు పరిశ్రమలు, వాణిజ్య రంగం, వ్యాపార రంగం, జనరేటర్ లేని ఏ ఒక్క షాపు, ఇన్వర్టర్ లేని ఇల్లు ఉండేదా? అని ప్రశ్నించారు. ప్రపంచంలో పారిశ్రామికవేత్తలు ధర్నా చేసిన మొట్టమొదటి సందర్భం సమైక్య పాలనలోనే హైదరాబాద్‌లో జరిగిందని అన్నారు.

# మేడిగడ్డ ముప్పును ఏడాదిన్నర క్రితమే గుర్తించారా?



హైదరాబాద్ : షాకింగ్ నిజం బయటకు వచ్చింది. కీలకమైన ఎన్నికలకు కాస్త ముందు.. మేడిగడ్డ బ్యారేజీ దిగువ భాగంలో పియర్స్ ప్రాంతంలో నీటి బుడగలు ఏర్పడటం.. పిల్లర్లు కుంగిన వైనం తెలిసిందే. కేసీఆర్ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ప్రాజెక్టులో ఇలాంటి పరిస్థితి ఏర్పడటం సంచలనంగా మారింది. దీంతో.. ప్రాజెక్టు నాణ్యత మీద బోలెడన్ని సందేహాలు వ్యక్తమవుతున్న పరిస్థితి. ఇంతకూ మేడిగడ్డ బ్యారేజీ దిగువ భాగంలో చోటు చేసుకున్న మార్పుల గురించి అధికారులు ఎలా రియాక్టు అయ్యారు? అన్న దానిపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. మారిన ప్రభుత్వం.. ఈ అంశంపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో షాకింగ్ నిజాలు బయటకు వస్తున్నాయి. బ్యారేజీ ఏడో బ్లాకులోని 17, 18, 19, 20 వెంట్స్ దిగువన బాయిలింగ్ ఆఫ్ వాటర్ ఏర్పడిందని.. దాని నివారణకు చర్యలు తీసుకోవాలని.. దిగువ భాగంలోనే సిమెంటు కాంక్రీట్ బ్లాక్స్ పక్కకు జరిగినట్లుగా ఈ ప్రాజెక్టుకు కాంట్రాక్టర్‌గా వ్యవహరించిన ఎల్ అండ్ టీకి ఇరిగేషన్ ఇంజినీర్లు లేఖలు రాసిన వైనం బయటకు వచ్చింది. ఈ పరిస్థితి ఏప్రిల్ 2022లో చోటు చేసుకున్నట్లుగా గుర్తించారు. షాకింగ్ అంశం ఏమంటే..ఆ సమయానికి ప్రాజెక్టు నిర్వహణతో పాటు.. ఏదైనా నష్టం వాటిల్లిన పక్షంలో కాంట్రాక్టు ఏజెన్సీనే బాధ్యత వహించే కాలం. అలాంటప్పుడు అధికరారులు ఎల్ అండ్ టీ మీద ఒత్తిడి తెచ్చినా.. ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్ చేసినా పరిస్థితి మరోలా ఉండేది. అయితే.. కింది స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు గ్రౌండ్ లో జరుగుతున్న పరిణామాలను పేర్కొంటూ సమాచారం అందించినా.. అత్యున్నత స్థాయిలో అలాంటి తీరు లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక్కడో మరో తేడాను గుర్తించినట్లుగా చెబుతున్నారు. ఓవైపు పెండింగ్ పనులు చేయలేదనిలేఖలు రాసిన ఇంజినీర్లు.. ఒప్పందం ప్రకారం పని పూర్తి చేసినట్లుగా సర్టిఫికేట్ ఎలా ఇచ్చారన్నది ప్రశ్నగా మారింది. ఒప్పందం ప్రకారం పని పూర్తి చేసిన తర్వాత రెండేళ్ల వరకు ఏదైనా లోపం జరిగితే బాధ్యత వహించేలా కాంట్రాక్టర్ తో ఒప్పందం ఉంటుంది. ఇలాంటి వేళ.. సదరు కాంట్రాక్టర్ కు లేఖలు రాసేసి వదిలేయకుండా.. వారి మీద ఒత్తిడి తెచ్చి పనులు పూర్తి చేయించుకోవాల్సిన బాధ్యత సీనియర్ అధికారుల మీద ఉంటుంది. అలాంటప్పుడు ప్రాజెక్టు పనుల్ని పర్యవేక్షించే సీనియర్ ఇంజినీర్లు ఈ విసయాన్నిఎందుకు విస్మరించారన్నది ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది.

తాజాగా వెలుగు చూసిన వివరాల్ని చూస్తే.. దెబ్బ తిన్న పనుల గురించి లేఖ రాయటంతోపాటు.. వెంటనే పనులు చేయకుంటే బ్యారేజీకి ఎక్కువ నష్టం జరుగుతుందని.. వీటిని సీజన్ లోపు పూర్తి చేయటం కష్టమవుతుందని స్పష్టం చేస్తూ లేఖలు రాశారు. యుద్ధ ప్రాతిపదికన చేయాల్సిన పనుల్లో నాలుగింటిని పేర్కొన్నారు. అవన్నీ కూడా దెబ్బ తిన్నవి.. బాగు చేయాల్సిన అవసరం ఉన్నవే. కానీ.. అదేమీ జరగకపోవటం ఏమిటన్నది ప్రశ్నగా మారింది.

మొత్తంగా కింది స్థాయి అధికారులు ముందే గుర్తించిన లోపాన్ని సరి చేసే విషయంలో అటు ప్రభుత్వం కానీ.. ఇటు సీనియర్ అధికారులు కానీ సరైన రీతిలో స్పందించలేదన్నట్లుగా బయటకు వచ్చిన వివరాలు ఉండటం గమనార్హం.

## తప్పులు జరగకుండా ఐఏఎస్ - ఐపిఎస్‌ల నియామకాలు

# రేవంత్ టాప్ ప్రయారిటీ ఇదే

## ఎక్కడా మాటరానివ్వకుండా ఆచితూచి అడుగులు



హైదరాబాద్ : తెలంగాణలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సారథ్యాన్ని వహిస్తోన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. పరిపాలనపై తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తోన్నారు. ఇందులో భాగంగా భారీ ఎత్తున ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తోన్నారు. మెరికల్లాంటి బ్యూరోక్రాట్లను కీలక స్థానాల్లో నియమిస్తోన్నారు. శాంతి భద్రతలు, ప్రజా సమస్యల పరిష్కారం, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల కల్పన, ఎన్నికల ప్రచార సమయంలో ప్రకటించిన ఆరు ఉచిత గ్యారంటీల అమలు.. వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడానికి ప్రాధాన్యత ఇస్తోన్నారు రేవంత్ రెడ్డి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో చోటు చేసుకున్నట్లుగా భావిస్తోన్న తప్పులను సరిదిద్దుతున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించే క్రమంలో పాలనను వారి వద్దకే తీసుకెళ్తోన్నారు. ఈ క్రమంలో ప్రజావాణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వారం రోజులు మంగళ, శుక్రవారాల్లో హైదరాబాద్ బేగంపేట్‌లోని ప్రజా భవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. ఒక్కో రోజు ఒక్కో శాఖకు చెందిన మంత్రులు ప్రజావాణిలో పాల్గొంటారు. ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారు. ఈ మంగళవారం కూడా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి కొనసాగుతుంది. ధరణి పోర్టల్, పింఛన్లు, డబుల్ బెడ్ రూం.. వంటి అంశాలు ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి అందుతున్నాయి. తిరుమలలో వైకుంఠ ద్వారం తెరచుకునే సమయాన్ని ప్రకటించిన టీటీడీ ఒక్కో ప్రజావాణిలో వేల సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి. వాటన్నింటినీ శాఖలవారీగా విభజించి, ఏ శాఖకు చెందిన ఫిర్యాదులు, విజ్ఞప్తులను ఆ శాఖకు పంపుతున్నారు అధికారులు. వాటిని పరిష్కరించడానికి ఆయా మంత్రులు, ఆ శాఖకు సంబంధించిన అధికారులు ప్రాధాన్యత ఇస్తారు. ఈ ఫిర్యాదులు, విజ్ఞప్తులు సత్వరంగా పరిష్కరించడానికి రేవంత్ రెడ్డి.. ప్రత్యేకంగా ఓ ఐఎఎస్ అధికారిని నియమించారు. దాసరి హరిచందనను నోడల్ అధికారిగా అపాయింట్ చేశారు. ఆయుష్ డైరెక్టర్‌గా ఉన్న దాసరి హరిచందనను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు బదిలీ చేసింది ప్రభుత్వం. అదే సమయంలో ప్రజావాణి నోడల్ అధికారిగా అదనపు బాధ్యతలను అప్పగించింది.

## సంపాదకీయం

# మళ్ళీ మోడీయేనా?

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చరిష్మా పెరుగుతోంది. దేశంలో మోడీ ప్రతిష్ట మరింత ఇనుమడిస్తోంది. దేశవ్యాప్తంగా బీజేపీతోనే సుస్థిర పాలన సాగుతుందని నమ్ముతున్నారు. అందుకే రెండుసార్లు బీజేపీకి అధికారం కట్టబెట్టారు. మూడోసారి కూడా అధికారం సాధించాలని ప్రయత్నిస్తోంది. బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఇతర పార్టీలు ముందుకు రావడం లేదు. దీంతో మరోమారు బీజేపీనే అధికారం ఖాయమని అంచనా వేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న విధానాలతో దానిపై అందరికి విశ్వాసం ఏర్పడుతోంది. ఇతర దేశాలను నియంత్రించడంలో దాయాది దేశాలను కట్టడి చేయడంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. పాకిస్తాన్, చైనాలను కట్టడి చేయడంలో తనదైన పాత్ర పోషిస్తోంది. రెండు దేశాలతో మన దేశం పాటిస్తున్న వైఖరితో మన రక్షణపై నమ్మకం పెరిగింది. ఇంతకుముందున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉగ్రవాద చర్యలు బాధించాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో ఉగ్రవాద చర్యలు భయపడేవారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టెర్రరిజాన్ని తుదముట్టించారు. శాంతిభద్రతలే లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు మంచి ఫలితాలు ఇచ్చాయి. దీంతో బీజేపీకి రెండుసార్లు ఇచ్చారు. దీంతో అందుకనుణంగా బీజేపీ కూడా ముందుకు వెళ్తోంది. ఈనేపథ్యంలో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి మూడోసారి అధికారం ఖాయమనే వాదనలు వస్తున్నాయి. ఇటీవల జరిగిన అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్ గడ్ రాష్ట్రాల్లో బీజేపీ విజయ దుందుభి మోగించింది. తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ అధికారం దక్కించుకుంది. ఇలా మోడీ నాయకత్వానికి ప్రజలు జై కొడుతున్నారు. ఇతర పార్టీలను నమ్మే స్థితిలో ప్రజలు లేరు. సుస్థిర పాలన అందించడం ఒక బీజేపీతోనే సాధ్యమని గుర్తించారు. అందుకే మూడోసారి కూడా నరేంద్ర మోడీ నాయకత్వానికే మొగ్గు చూపుతున్నట్లు పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ప్రపంచ దేశాల నాయకుల్లో కూడా మోడీదే పైచేయిగా ఉంటోంది. దీంతో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా బీజేపీ అప్రతిహ విజయయాత్ర కొనసాగిస్తుందని అంచనాలు తెలియజేస్తున్నాయి. దీంతో బీజేపీ మూడోసారి అధికారం జేజిక్కించుకోవడం కామనే అంటున్నారు.

# సి ఈ ఐ ఆర్ యాప్ పాశుపతాస్త్రం..

**ఫోన్ పోతే కంప్లైంట్ తీసుకోలేదని, క్రైమ్ రిజిస్టర్ కాలేదని,ఎఫ్ఐఆర్ కట్టలేదన్న చింత అవసరం లేదు..**
**పోగొట్టుకున్న 50 ఫోన్ లను బాధితులకు అందజేసిన రాజేంద్రనగర్ డిసిపి ఆర్ జగదీశ్వర్ రెడ్డి**






సైబరాబాద్ క్రైమ్ (గరుడ వార్త) : ఫోన్ పోగానే కేంద్ర ప్రభుత్వం రూపొందించిన సి ఈ ఐ ఆర్ యాప్ లో వివరాలను నమోదు చేయడం ద్వారా, పోయిన ఫోన్ ఆన్ చేయగానే పోలీసులకు సమాచారం అందుతుందని తద్వారా పోయిన ఫోన్లను రికవరీ చేసే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయని రాజేంద్రనగర్ డిసిపి ఆర్ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం రాజేంద్రనగర్ డిసిపి ప్రెస్ మీట్ నిర్వహించి, స్మార్ట్ ఫోన్లు పోగొట్టుకున్న 50 మంది బాధితులకు, రికవరీ చేసిన 50 ఫోన్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇక మీదట ఫోన్ పోతే తక్షణం సి ఈ ఐ ఆర్ యాప్ లో ఫోన్ వివరాలను నమోదు చేస్తే చాలు ఎవరైనా ఫోన్ ఆన్ చేయగానే పోలీసులు వారిని పట్టుకోగాలుగుతారని రాజేంద్రనగర్ డిసిపి అన్నారు. ఫోన్ పోతే తమ కంప్లైంట్ తీసుకోలేదనో, క్రైమ్ రిజిస్టర్ కాలేదనో, లేక ఎఫ్ఐఆర్ కట్టలేదని చింతించాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. ఎప్పుడైనా ఫోన్ పోయిన బాధితుడు తక్షణం సి ఈ ఐ ఆర్ యాప్ లో పోయిన ఫోన్ ఈఎంఐ నెంబర్, బాధితుడి పేరు, ఫోన్ నెంబర్ తో పాటుగా ఎక్కడ పోయింది ఎలా పోయిందని వివరాలు నమోదు చేస్తే సరిపోతుందన్నారు.

దీంతో పోయిన ఫోను స్విచ్ ఆన్ చేయగానే వారి వివరాలు పోలీసులకు తెలిసిపోతాయని, తద్వారా ఫోన్లో రికవరీ చేయడం సాధ్యమవుతుందని తెలిపారు. సి ఈ ఐ ఆర్ యాప్ ద్వారా కేవలం రాజేంద్రనగర్ డివిజన్లో 200 ఫోన్లను ఇప్పటివరకు రికవరీ చేయగలిగారని తెలిపారు. అందుకే ఇకనుండి ప్రతి ఒక్కరు తప్పక ఎవరిదైనా ఫోన్ పోతే సి ఈ ఐ ఆర్ యాప్ లో వారి వివరాలను నమోదు చేయాలని డిసిపి కోరారు. అంతేకాకుండా ముఖ్యంగా యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే కోర్టు ద్వారా కాకుండా నేరుగానే పోలీసులు బాధితుని గుర్తించి వారికి ఫోన్ అందజేయగలుగుతారని తెలిపారు. సీఈఐఆర్ యాప్ లో నమోదు చేయడం ద్వారా పోయిన ఫోన్లు చాలా మేరకు రికవరీ చేయగలిగామని అందుకే ప్రతి ఒక్కరు తప్పక సీఈఐఆర్ యాప్ లో పోయిన ఫోన్ వివరాలు నమోదు చేయవలసిందిగా డీసీపీ కోరారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన



శామీర్ పేట(గరుడ వార్త) మూడుచింతలపల్లి మండల కేంద్రంలో విక్సిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమా లను అధికారులు గ్రామస్తులకు వివరించారు. అనంతరం మండల ఆరోగ్యమిత్ర యూసుఫ్ పాల్గొని అభ కార్డుపై అవగాహన కార్డు రూపొందించడం, ఆయుష్మాన్ భారత్ జన్ ఆరోగ్య యోజన, ఆరోగ్యశ్రీ కార్డులు పొందే విధానం వాటి ప్రయోజనాల గురించి వివరించారు. మేరీ కహానీ మేరీ జుబానీలో భాగంగా వివిధ కేంద్ర పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులు మరి అభిప్రాయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దమయంతి, ఏ ఓ కృష్ణవేణి, గ్రామ సర్పంచ్ జామ్ రవి, ఉప సర్పంచ్ వెంకటరమణా రెడ్డి, టీబీ సూపర్ వైజర్ జైహింద్ రెడ్డి, ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ మండల్ ఇంచార్జి యూసుఫ్, ఆశా వర్కర్లు, అంగన్వాడీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎత్తులో వెల్డింగ్ చేస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు కింద పడి మృతి

శామీర్ పెట (గరుడ వార్త) : 20 అడుగుల ఎత్తులో వెల్డింగ్ చేస్తుండగా సదరు కార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన సంఘటన శామీర్పేట పోలీస్ స్టేషన్లో చోటుచేసుకుంది. శామీర్ పెట పోలీసులు తెలిపిన వివరాలను సారం రంగారెడ్డి జిల్లాకు చెందిన కేమిడి కుమారస్వామి బుధవారం సాయంత్రం 6:30 సమయంలో శామీర్పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మజీద్పూర్ గ్రామంలోని సీడ్స్ కంపెనీలో 20 అడుగుల ఎత్తులో వెల్డింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడటంతో కుమారస్వామి తలవెనకాల బలమైన గాయం అయిందని, దీంతో అతన్ని గాంధీ హాస్పిటల్ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు కుమార స్వామిని పరిశీలించి మృతి చెందినట్లుగా ధ్రువీకరించారని పోలీసులు తెలిపారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు.

# ధాన్యం మిల్లింగ్ కష్టం

సిరిసిల్ల : పండిన ధాన్యాన్ని మరాడించడం కష్టంగా మారింది. నాలుగేళ్లుగా వానాకాలం, యాసంగి పంటల దిగుబడులు క్రమంగా పెరిగాయి. దానికి సరిపడా ఉప్పుడు, ముడి బియ్యం మిల్లులు లేకపోవడంతో జిల్లాలో అధికారులకు, ఇటు మిల్లర్లకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఫలితంగా ఇక్కడ పండిన పంటలో సగానికిపైగా పొరుగు జిల్లాల్లోని మిల్లులకు కేటాయించాల్సి వస్తోంది. మరోవైపు బియ్యాన్ని ఎఫ్‌సీఐకి కేటాయించే క్రమంలోనూ ఇబ్బందులే. జిల్లాలో ఎఫ్‌సీఐ గోదాంలు లేకపోవడమే ఇందుకు కారణం. ముడి బియ్యానికి కరీంనగర్‌కు, ఉప్పుడు బియ్యానికి జగిత్యాల జిల్లాల్లోని గోదాంల్లో 37 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యమిచ్చారు. దీనికితోడు ఎఫ్‌సీఐ నిబంధనలతో నాలుగు నెలలుగా అయిదు వేల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లులకే పరిమితమయ్యాయి. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే ఇప్పుడు రాబోయే వానాకాలం ధాన్యం నిల్వలపైనా ప్రభావం చూపనుంది.

పొరుగు జిల్లాలకు కేటాయింపులు

జిల్లాలో ముడి, ఉప్పుడు బియ్యం మిల్లులు కలిపి వంద ఉన్నాయి. వీటికి వానాకాలం (2022-23)లో 2,18,420.76 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాలశాఖ కేటాయించింది. దీనిలో సీఎంఆర్ కింద 1,46,713.919 మెట్రిక్ టన్నులు (ఉప్పుడు, ముడి) బియ్యం కలిపి ఎఫ్‌సీఐకి అప్పగించాలి. ఇప్పటి వరకు 44,681.290 మెట్రిక్ టన్నులు ఇచ్చారు. అంటే లక్ష్యంలో 30 శాతం మాత్రమే. ఇక యాసంగి (2022-23)లో 2,18,413.680 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించారు. ఇందులోనూ 1,46,917.106 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉండగా 32,973 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు. లక్ష్యంలో ఇది 22 శాతం మాత్రమే. రెండు సీజన్లకు సంబంధించి ధాన్యం నిల్వలు 70-80 శాతం మిల్లుల్లోనే ఉన్నాయి. జిల్లాలో రెండు రకాల మిల్లుల సామర్థ్యం కలిపి మరాడించే సామర్థ్యం 1.6 లక్షల మెట్రిక్ టన్నులు. దీనికి ధాన్యం దిగుబడులు రెండింతలు వస్తుంది. సేకరణలో మూడు లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. ప్రతి సీజన్‌లో కరీంనగర్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాలకు కేటాయిస్తున్నారు.

దృష్టిసారించాలిధాన్యం దిగుబడులకు తగ్గట్టుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మిల్లుల విస్తరణ జరగాలి. వీటితోపాటే ఎఫ్‌సీఐ నిబంధనల మేరకు గోదాంల నిర్మాణం అవసరం. ఇవి ప్రస్తుతం రైలు మార్గం అందుబాటులోని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. ఆరేళ్ల క్రితం వరకు జిల్లాలో ధాన్యం దిగుబడులు సగటున లక్ష మెట్రిక్ టన్నులు ఉండేది. ఇప్పుడు మూడు లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. సాగు విస్తీర్ణం, ధాన్యం దిగుబడులు వచ్చినంత వేగంగా మిల్లుల ఏర్పాటు కాలేదు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. జిల్లాకు నలువైపులా రైలు మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ఇటీవలే జిల్లాకు 40 కిలోమీటర్ల దూరంలోని సిద్దిపేట వరకు రైలు మార్గం అందుబాటులోకి వచ్చింది.

# వాట్సాప్‌లో సస్యరక్షణ సలహాలు

కొత్తగూడెం : ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటలు చేతికొచ్చే సమయంలో తెగుళ్ల బారిన పడుతున్నాయి. దిగుబడిపై ఇది ప్రభావం చూపుతుందని కర్షకుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొందరికి సమస్యపై సరైన అవగాహన లేక ఫెర్టిలైజర్ దుకాణదారులు ఇచ్చిన మందులు పిచికారీ చేస్తున్నారు. ఒక్కోసారి అవి సరిగా పనిచేయక వారం, పదిరోజుల వ్యవధిలోనే మళ్లీ పిచికారీ చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో రైతులకు తెగుళ్లు, చీడపీడలపై అవగాహన కల్పించేందుకు కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వినూత్న పంథా అవలంబిస్తున్నారు. ఎవరైనా రైతు తెగుళ్లు, చీడపీడలు సోకిన పైరు చిత్రాన్ని ప్రత్యేక వాట్సాప్ నంబరు 99668 14470 (జిల్లా వ్యవసాయ, వాతావరణ విభాగం)కు పంపితే చాలు.. తక్షణం సాంకేతిక సలహాలు సిఫార్సు చేస్తున్నారు.

36 గ్రూప్‌లతో చేరువ

రైతులకు సలహాలు, సూచనలు చేసేందుకు కేవీకే వారు వ్యవసాయ అధికారులు, ఫర్టిలైజర్ దుకాణాల నిర్వాహకుల సమన్వయంతో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.వి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో, జిల్లా వ్యవసాయ వాతావరణ విభాగం పర్యవేక్షకుడు ఎం.సుమన్ పర్యవేక్షణలో దీన్ని నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అయిదు వ్యవసాయ డివిజన్లలోని 26 ఫెర్టిలైజర్ దుకాణదారులు, రైతులకు చెందిన మరో 10 గ్రూపులను అనుసంధానం చేశారు. సాగు విధానాలు, వాతావరణ పరిస్థితులు, వివిధ పంటల్లో ఏర్పడే తెగుళ్లు, రైతుల సందేహాలు, శాస్త్రవేత్తల సలహాలను వాటిల్లో పోస్టు చేస్తున్నారు. 'వరి, మిరప, పత్తి, మొక్కజొన్న రైతులు ఎక్కువగా వాట్సాప్ గ్రూప్ సలహాలు స్వీకరిస్తున్నారు. ఇటీవల వంద మందికి పైగా పంట రక్షణకు పరిష్కారాల్ని పొందారు. సరైన సమయంలో, తగిన మందు పిచికారి చేసుకుంటే నష్టాన్ని నివారించుకోవచ్చు. సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని' ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.వి.లక్ష్మీనారాయణమ్మ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు. అధికారులు, వ్యాపారులు, రైతుల అనుసంధానంగా 'కేవీకే' సేవలు

'ఎకరాలో మిరప సాగు చేశా. ఇటీవల పైరుకు పైముడత ఆశించింది. వెంటనే చిత్రాలను వాట్సాప్‌లో పంపించా. రసం పీల్చే పురుగులు ఆకుల అడుగు భాగాన్ని ఆశించడం వల్ల.. అవి పైకి ముడుచుకు పోయినట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. వారి సూచనతో ఎకరాకు 30 నుంచి 40 చొప్పున పసుపు, నీలిరంగు జిగురు అట్టలు ఏర్పాటు చేశాం. పై పాటుగా లీటరు నీటికి 2 ఎం.ఎల్. ఫిప్రోనిల్, లేదా 0.25 స్పైనోసాడ్, లేదా 1.2 గ్రా సైయాంట్రానిలిప్రోల్, లేదా 1 ఎం.ఎల్. స్పైనోటోరం మందు సిఫార్సు చేశారు. ఆ సూచనలు పాటించడంతో సమస్య తగ్గింది.'

పోతురాజు వెంకటేశ్వర్లు, రైతు, చంద్రుగొండ

పోస్టు చేసిన వెంటనే సిఫార్సులు

వరిలో ఆకు ముడత, కాండం తొలుచు పురుగు, బ్యాక్టీరియా ఆకు ఎండుతెగులు, పత్తిలో రసం పీల్చే పురుగు, కాండం ముక్కు పురుగు, పొగాకు లద్దె పురుగు, మిరపలో రసం పీల్చే పురుగు, జెమిని వైరస్, పచ్చ పురుగు, మొక్కజొన్నలో కత్తెర పురుగు ఇతర తెగుళ్లు ప్రధానంగా వ్యాపిస్తున్నాయి. తెగుళ్లు సోకిన చిత్రాలను వాట్సాప్ నంబరుకు పంపాలి. వెంటనే స్పందించి సస్యరక్షణకు సిఫార్సులు చేస్తాం.సుమన్ జిల్లా వాతావరణ విభాగం పర్యవేక్షకుడు, కేవీకే

# కరవుకు చెక్‌డ్యాంలు

వరంగల్ : వాన నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంచాలనే ఉద్దేశ్యంతో తలపెట్టిన చెక్‌డ్యాం నిర్మాణాలు సత్ఫలితాలనిస్తున్నాయి. భూగర్భ జలాలు పెరగడంతో కరవు నేలల్లో రైతన్నల ఆశలు చిగురిస్తున్నాయి. నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ భూములు సాగులోకి వచ్చాయి. చెక్‌డ్యాంల చుట్టుపక్కల 5 చదరపు కిలోమీటర్ల మేర నీటి ఊట పెరిగి వట్టిపోయిన బోర్లు తిరిగి నీటిని తోడేస్తున్నాయి. గతంలో నిర్మించిన 30 చెక్‌డ్యాంలతో కలిగిన ప్రయోజనాలను గుర్తించిన ప్రజాప్రతినిధులు జిల్లాలో మరో 13 చెక్‌డ్యాంలు నిర్మించాలని అధికారులను ఆదేశిస్తూ, అనుమతులను మంజూరు చేసింది.

గతంలో నిరుపయోగంగా వాగులు

దేవరుప్పుల మండలంలో కోలుకొండ నుంచి మన్‌పహాడ్ వరకు యశ్వంతాపూర్ వాగు విస్తరించింది. ఇంత పెద్ద వాగుపై కేవలం చౌడూరు సమీపంలో ఒక్క చెక్‌డ్యాం నిర్మించడంతో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఫలితంగా దేవరుప్పుల మండలంలోని వివిధ గ్రామాల్లో విస్తరించిన వాగు పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో యాసంగి పంట వేయడానికి రైతులు సందేహపడేవారు. వరద నీరు పూర్తిగా సూర్యాపేట జిల్లాలోని సోలిపేట చెరువులోకి చేరేది. ఈ కారణంగా యాసంగి పంట కోతల సమయంలో నీరు అందక పంటలు ఎండిపోయిన సందర్భాలు చాలా ఉన్నాయి. దీంతో యాసంగిలో రైతులు పొలాలను వదిలివేసేవారు.

కలిసొచ్చిన అవకాశం

దేవరుప్పుల మండలంలో విస్తరించిన యశ్వంతాపూర్ వాగు ప్రాధాన్యతను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గుర్తించి, జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో చెక్‌డ్యాంల నిర్మాణాలకు అనువైన స్థలాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. పాలకుర్తి నియోజకవర్గంలో 18, స్టేషన్ ఘన్‌పూర్‌లో 5, జనగామలో 7 చోట్ల ప్రదేశాలను గుర్తించి నివేదిక తయారు చేశారు. పనులను పూర్తి చేయడంతో ప్రస్తుతం భూగర్భ జలాలు అధికంగా పెరిగాయి.

జిల్లాలో మరో 13...

జిల్లాలో ఉన్న మూడు నియోజకవర్గ పరిధిలో 13 చెక్‌డ్యాంలను నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు ప్రభుత్వం రూ.84.92 కోట్లను మంజూరు చేసింది. వీటి నిర్మాణం పూర్తయితే దాదాపు 7060 ఎకరాలకు సాగు నీరు అందుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. త్వరలోనే పనులు ప్రారంభించి వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు.

మంత్రి చొరవతో దక్కిన అవకాశం

– పల్లా భార్గవి, జడ్పీటీసీ సభ్యురాలు

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చొరవతోనే ఎనిమిది చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తయింది. కరువు నేలగా ఉన్న దేవరుప్పుల సస్యశ్యామలంగా మారింది. వాగు పరివాహక ప్రాంతంలో సాగు విస్తీర్ణం పెరిగింది. చెక్‌డ్యాంలతో పాటు మండలంలోని వివిధ చెరువులను అనుసంధానం చేస్తూ త్వరలో కాల్వల నిర్మాణం చేపడతాం.

నిర్మాణాలతో సత్ఫలితాలు

– ఎర్రబెల్లి దయాకర్‌రావు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి

భూగర్భ జలాలు పెరగడానికి చెక్‌డ్యాంలు ఉపకరిస్తాయి. త్వరలోనే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అధికారులతో సర్వే చేసి మరిన్ని చెక్‌డ్యాంలు నిర్మించడానికి కృషి చేస్తాం. పాలకుర్తి నియోజకవర్గంలో నిర్మించిన 18 చెక్‌డ్యాంలు మత్తడి పోయడం సంతోషాన్ని కలిగించింది. ఇటీవల మంజూరైన చెక్‌డ్యాంలకు త్వరలోనే శంకుస్థాపన చేసి పనులు పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం.

# మార్కెట్ పాలకవర్గం కొలువుదీరేదెన్నడో..!

చౌటుప్పల్ : చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం కోసం ఆశావహులు ఎదురు చూస్తున్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ నేతలు పాలకవర్గంలో తమకు చోటు దక్కుతుందని ఆశిస్తున్నారు. చౌటుప్పల్, చిట్యాల, భూదాన్ పోచంపల్లి మండలాల పరిధిలోని 47 గ్రామాలతో ఈ మార్కెట్ కమిటీ కొనసాగుతోంది. అంతకు ముందున్న పాలకవర్గం పదవీకాలం 2023 జనవరి ఒకటో తేదీతో పూర్తయ్యింది. అప్పటి నుంచి కొత్త పాలకవర్గం నియామకం జరగలేదు. ఛైర్మన్, డైరెక్టర్ పదవులు ఖాళీగా ఉన్నాయి. చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోకి సంస్థాన్ నారాయణపురం మండలాన్ని చేర్చాలని గతంలో ఆ మండల రైతులు ప్రభుత్వాన్ని కోరారు. సంస్థాన్ నారాయణపురం మండలం ప్రస్తుతం చండూరుకు ఉప మార్కెట్‌గా కొనసాగుతోంది. పేరుకు ఉప మార్కెట్‌గా ఉన్నా అక్కడ సబ్ మార్కెట్ యార్డుగానీ, గిడ్డంగులు గానీ నిర్మించలేదు. రైతులు తమ ధాన్యాన్ని అమ్మేందుకు 35 కిలోమీటర్ల దూరంలోని చండూరుకు వెళ్లాల్సి వస్తోంది. రైతులు అంతదూరం వెళ్లలేక పక్కనే ఉన్న చౌటుప్పల్ మార్కెట్ యార్డుపై ఆధారపడుతున్నారు. జిల్లాల విభజన జరగడంతో నల్గొండ జిల్లాలో ఉండే సంస్థాన్ నారాయణపురం మండలాన్ని యాదాద్రి భువనగిరి జిల్లాలోకి మార్చారు. మార్కెట్ కమిటీ మాత్రం ఇప్పటికీ నల్గొండ జిల్లా చండూరులోనే




కొనసాగుతోంది. తమ మండలాన్ని చండూరు నుంచి చౌటుప్పల్ మార్కెట్ కమిటీ పరిధిలోకి మార్చాలని రైతులు గతంలో ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేశారు. నూతన ప్రభుత్వం ఈ ప్రతిపాదనను అమలు పరిస్తే చౌటుప్పల్ మార్కెట్ పరిధిలోని 47 గ్రామాలకు అదనంగా సంస్థాన్ నారాయణపురం మండలంలోని 31 గ్రామాలు చేరతాయి.

**ఖాళీగా పాలకవర్గం**

చౌటుప్పల్ మార్కెట్ కమిటీకి ప్రస్తుతం పాలకవర్గం లేదు. 2023 జనవరి ఒకటితో అంతకు ముందున్న పాలకవర్గం పదవీకాలం ముగిసింది. ప్రాంతీయ మార్కెటింగ్ అధికారి పర్సన్ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. ఈసారికి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవిని ఎస్సీ (జనరల్)కు రిజర్వ్ చేశారు. నూతన పాలకవర్గం 17 మందితో ఏర్పాటు చేయాల్సి ఉంది. కొత్త మండలాన్ని చేర్చితే చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, చిట్యాల, పోచంపల్లి మండలాలకు చెందిన రైతు ప్రతినిధులను ఈ మార్కెట్ కమిటీ పాలకవర్గంలో నియమించే అవకాశముంది.

# సారపాకపై వీడని సందిగ్ధం

భద్రాచలం : బూర్గంపాడు మండలం సారపాక ఎన్నికలపై సందిగ్ధం వీడడం లేదు. మున్సిపాలిటీగా మారుస్తారనే ప్రచారంతో 2019లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేదు. అనంతరం చేపట్టిన పురపాలక ఎన్నికల్లోనూ సారపాక పేరు చేర్చలేదు. తదనంతరం నిర్వహించిన పరిషత్ పోరులోనూ సారపాకను పరిగణనలోకి తీసుకోలేదు. సారపాక పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారింది.

రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం వచ్చే ఏడాది ఫిబ్రవరి 1తో ముగియనుంది. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. దీనికి అనుగుణంగా స్థానిక అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. కానీ సారపాక విషయంలో సందిగ్ధం వీడడం లేదు. సారపాకతో పాటు ఎన్నికలు నిర్వహించని పంచాయతీల అంశంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ పలువురు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. వాదోపవాదాల అనంతరం ఈ పంచాయతీల విషయంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు అప్పటి ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో పారిశ్రామిక ప్రాంతం సారపాకను రెండు పంచాయతీలుగా విభజిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ప్రధాన రహదారికి ఒకవైపు సారపాక పంచాయతీ.. మరోవైపు ఐటీసీ పంచాయతీగా నిర్ణయించారు. ఇదే విషయాన్ని కోర్టుకూ విన్నవించారు. ఎన్నికల అంశం మరోసారి తెరమీదకు వచ్చింది. సారపాకలో ఎన్నికలు నిర్వహిస్తారని స్థానికులూ భావించారు. కానీ ఎన్నికలు నిర్వహించలేదు.



**ఐదేళ్లుగా పాలకవర్గం లేకుండానే..**

జిల్లాలో అత్యంత రాజకీయ చైతన్యం కలిగిన ప్రాంతాల్లో సారపాక ఒకటి. ఇక్కడ సుమారు 40 వేల మంది నివసిస్తున్నారు. పారిశ్రామికంగా ముందంజలో ఉన్న ఈ పంచాయతీ ఐదేళ్లుగా పాలకవర్గం లేకుండానే ఉంది. ప్రత్యేక అధికారుల పాలనలోనే కొనసాగుతోంది. పాలకవర్గం లేకపోవడంతో అనుకున్న స్థాయిలో అభివృద్ధి కొనసాగడం లేదన్న భావన స్థానికుల్లో నెలకొంది. ఎన్నికలు నిర్వహించకుండా త్రిశంకు స్వర్గంలో ఉంచడంతో ఆంతర్యం ఏమిటో అంతుచిక్కడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సారపాకలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని కోరుతున్నారు.

# ఉపాధ్యాయుల్లేక.. పది గట్టెక్కేదెలా?



భద్రాచలం : ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలతో జిల్లా వ్యాప్తంగా వివిధ జడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థుల బోధన ప్రశ్నార్థకంగా మారింది. జిల్లా వ్యాప్తంగా 211 ఉన్నత పాఠశాలలు ఉండగా వీటిలో 70 శాతం పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలున్నాయి. పది పరీక్షలు మరో మూడు నెలల్లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో త్వరితగతిన అన్ని సబ్జెక్టుల్లో సిలబస్ పూర్తి చేసి విద్యార్థులకు పునఃశ్చరణ తరగతులు నిర్వహించాల్సి ఉంది. కానీ జిల్లాలో అత్యధిక పాఠశాలల్లో పాఠ్యాంశ నిపుణుల కొరత వల్ల నేటి వరకూ నెలల వారీగా పూర్తి చేయాల్సిన సిలబస్ పూర్తి చేయటం కష్టతరంగా మారింది. జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో 2,558 మందికిగాను 2,077 మంది మాత్రమే బోధిస్తున్నారు. ఈ లెక్కన 481 మంది ఉపాధ్యాయుల అవసరం ఉంది. ప్రస్తుతం జిల్లాలో అత్యధికంగా బయాలజీ, సాంఘిక శాస్త్రంలో ఎస్ఏల కొరత ఏర్పడింది. ప్రధాన సబ్జెక్టుల్లో ఉపాధ్యాయులు లేకపోవటం వల్ల చదువులు కుంటుపడుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉద్యోగోన్నతులు సరే.. సర్దుబాటు మరిచారేం..**

మూడు నెలల క్రితం ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించారు. పలు పాఠశాలల్లో ప్రధాన సబ్జెక్టులు బోధిస్తున్న 210 మంది సీనియర్ ఉపాధ్యాయులు హెచ్ఎంలుగా ఉద్యోగోన్నతిపై వెళ్లారు. వీరితో పాటు ఖమ్మం జిల్లా నుంచి ఇతర జిల్లాలకు సుమారు 85 మంది పదోన్నతిపై ప్రధానోపాధ్యాయులుగా వెళ్లటంతో ఇక్కడ కొరత ఏర్పడింది. కొందరు ఎస్ఏలకు బదిలీలు జరిగినప్పటికీ రిలీవర్ లేరన్న కారణంగా వారు నూతన పోస్టుల్లో నేటి వరకూ చేరలేదు. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీలను సమీప ఉన్నత పాఠశాలకు పంపి కొన్నిచోట్ల సర్దుబాటు చేసినప్పటికీ అది పూర్తి స్థాయిలో జరగలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ఉన్నత పాఠశాల్లో పదో తరగతి బోధించేందుకు ప్రధాన సబ్జక్టుల్లో నిపుణుల కొరత ఏర్పడింది. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి త్వరితగతిన సర్దుబాటులో భాగంగా ఉన్నత పాఠశాలలకు ఉపాధ్యాయులను పంపితే పదో తరగతి విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

**ఖాళీలు మచ్చుకు కొన్ని..**

చింతకాని మండలం ప్రొద్దుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ, నామవరం పాఠశాలలో బయాలజీ, నాగులవంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో రెండు తెలుగు పోస్టులు, బయాలజీ పోస్టు ఖాళీగా ఉన్నాయి. వీటిల్లో నాగులవంచలోనే తెలుగు ఉపాధ్యాయుడితో సర్దుబాటు చేశారు. మిగతా సబ్జెక్టుల్లో సిలబస్ పెండింగ్‌లో ఉంది.

187 మంది విద్యార్థులు ఉన్న తల్లాడ మండలం కుర్నవల్లి ఉన్నత పాఠశాలలో రెండు గణితం, ఒక హిందీ, 220 మంది విద్యార్థులున్న కొణిజర్ల మండలం పెద్దగోపతి జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు బయాలజీ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఆయా పాఠ్యాంశాల్లో సిలబస్ పూర్తి స్థాయిలో వెనుకబడి ఉంది.

బోనకల్లు జడ్పీ ఉన్నత పాఠశాల్లో బయాలజీ, తల్లాడ మండలం నూతనకల్ ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయులు లేకపోవటంతో సాంఘికశాస్త్రం పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**త్వరలో సర్దుబాటు చేస్తాం**

సకాలంలో సిలబస్ పూర్తి చేస్తాం. జిల్లా వ్యాప్తంగా పలు ఉన్నత పాఠశాలల్లో ప్రధాన సబ్జెక్టుల ఖాళీలను పని సర్దుబాటులో భాగంగా సమీప ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో వారంలోపు సర్దుబాటు చేస్తాం. విద్యార్థులకు ఇబ్బంది కలగనీయం. జనవరి లోపు సిలబస్ పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖ అధికారి

# గెలవాలని.. నిలవాలని..!



ఖమ్మం: తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో విజయబావుటా ఎగురవేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ.. లోక్‌సభ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. కేంద్రంలో అధికారంలోకి రావాలంటే ప్రతి లోక్‌సభ స్థానం కీలకం కావడంతో గతానికి భిన్నంగా ఈసారి ముందుగానే కార్యాచరణకు సిద్ధమవుతోంది. గాంధీభవన్ వేదికగా సోమవారం జరిగిన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలోనూ లోక్‌సభ ఎన్నికలపై ప్రత్యేక చర్చ సాగింది.

**ముగ్గురు మంత్రులు.. ఐదు నియోజకవర్గాలు**

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ.. లోక్‌సభ ఎన్నికల్లోనూ అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవాలని పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ప్రత్యేక దృష్టి సారించింది. మంత్రులు, ముఖ్యనేతలకు బాధ్యతలు అప్పగించింది. ఈ జాబితాలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ముగ్గురు మంత్రులకు చోటు దక్కింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క- హైదరాబాద్, సికింద్రాబాద్, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి- ఖమ్మం, మహబూబాబాద్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు- మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలుగా వ్యవహరించనున్నారు. ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలుపు బాధ్యతలను వీరు భుజానికెత్తుకోనున్నారు. ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని పది స్థానాలకు ఎనిమిది చోట్ల కాంగ్రెస్, ఒకచోట మిత్రపక్షం సీపీఐ గెలుపొందింది. భద్రాచలంలో భారాస విజయం సాధించింది. కాంగ్రెస్ గెలిచిన ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆయా ఎమ్మెల్యేలు, భద్రాచలంలో మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య బాధ్యులుగా వ్యవహరించనున్నారు. కొత్తగూడెం బాధ్యతలను ముఖ్యనేతకు పార్టీ అప్పగించనుంది. ఖమ్మం లోక్‌సభ స్థానంలో పాలేరు, ఖమ్మం, వైరా, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేట శాసనసభ నియోజకవర్గాలు, మహబూబాబాద్ లోక్‌సభ స్థానంలో ఇల్లెందు, భద్రాచలం, పినపాక అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాలను గత ఎన్నికల్లో భారాస గెలుచుకుంది. జనరల్ స్థానమైన ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం సీటును కాంగ్రెస్ తరపున అధికంగా ఆశిస్తున్నారు.

**నామినేటెడ్ పదవులపైనా ఆశలు**

లోక్‌సభ ఎన్నికల్లో నేతలు రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలంటే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. నెలరోజుల్లోపే రాష్ట్రవ్యాప్తంగా నామినేటెడ్ పదవులు కేటాయించాలని భావిస్తోంది. ఈ జాబితాలో తమకు చోటు దక్కుతుందని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకొని, కార్యకర్తలకు అండగా ఉన్న నాయకులకు చోటు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీరితోపాటు శాసనసభ ఎన్నికలకు ముందు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావును నమ్ముకుని కాంగ్రెస్‌లో చేరిన నేతలూ ఉన్నారు. ఇటువంటి వారిలోనూ చాలామంది నామినేటెడ్ పదవులపై గంపెడాశలు పెట్టుకున్నారు.

# ఇదీ పాయె..!

భద్రాచలం : భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న క్షయ నిర్ధరణ విభాగంలోని పరికరాలను జిల్లా కేంద్రానికి పంపించాలన్న ఉత్తర్వులపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొత్తగూడెంలోని టీ-హబ్‌కు పరికరాలను చేర్చడం వల్ల అక్కడ నిపుణులు పరీక్షలు చేస్తారని వైద్య ఆరోగ్య శాఖ రెండు నెలల కిందట ఆదేశించింది. దీన్ని అమలు చేసేందుకు ఇప్పుడు కసరత్తు సాగుతోంది. భద్రాచలం 200 పడకల ఏరియా ఆసుపత్రిలో 12 పడకలను క్షయ విభాగానికి ప్రత్యేకంగా కేటాయించారు. సంబంధిత వైద్యులు రోజువారీగా వచ్చే రోగులకు సేవలు అందిస్తున్నారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉంటే ఇన్‌పేషెంట్‌గా చేర్చుకుని చికిత్సలు చేస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌పేషెంట్ల సంఖ్య తక్కువగానే ఉంది. ఇంటి వద్ద ఉండి మందులు వాడే వారే ఎక్కువ. దశాబ్దాల చరిత్ర ఉన్న ఇక్కడి క్షయ విభాగంలో డాక్టర్ శ్రీనివాసు నేతృత్వంలో అందిస్తున్న సేవలకు పలు పురస్కారాలూ దక్కాయి. గతంతో పోల్చితే ఈ రోగం తగ్గుముఖం పట్టింది. అంతరాష్ట్ర సేవలు అందిస్తున్న భద్రాచలం క్షయ ఆసుపత్రికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులతోపాటు సరిహద్దున ఉన్న ఆంధ్రప్రదేశ్ విలీన గ్రామాలు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వాసులూ వస్తుంటారు. దీంతో ఇక్కడ అంతర్రాష్ట్ర సేవలు అందిస్తున్నారు. 2వేలకు పైగా క్షయ కేసులను ఇక్కడ గుర్తించారు. నెలకు ఇక్కడ 1,500 మందికి క్షయ పరీక్షలు చేస్తుండగా పదుల సంఖ్యలో క్షయ లక్షణాలు ఉన్నవారిని గుర్తిస్తున్నారు. ఇంతటి కీలక ప్రాంతం నుంచి టి-హబ్‌కు పరీక్ష పరికరాలను తరలించడం వల్ల రోగ నిర్ధరణ జాప్యం కానుంది. ఇది మన్యం వాసులకు ఇబ్బందే. మిగతా పరీక్షలను టి-హబ్‌కు




అనుసంధానం చేసినప్పటికీ క్షయ పరీక్షలను ఇంకొంత కాలం ఇక్కడ కొనసాగించాలని పలువురు కోరుతున్నారు. పరీక్ష పరికరాలు, యంత్రాలనూ తరలిస్తే ఇక్కడి నిపుణులకూ స్థానచలనం తప్పదన్న వ్యాఖ్యానాలూ వినిపిస్తున్నాయి. భవిష్యత్తులో క్షయ విభాగాన్నీ తరలించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇప్పటికే భద్రాచలం నుంచి పలు కార్యాలయాలు విద్యాలయాలు తరలిపోయాయి. ఇప్పుడు దీని వంతూ వచ్చిందా అన్న చర్చ సాగుతోంది.

క్షయ వార్డు ఇక్కడే ఉంటుంది ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు టీబీ పరీక్షల సామగ్రిని కొత్తగూడెంలోని టి-హబ్‌కు పంపిస్తాం. రోగ నిర్ధారణ అనేది కొత్తగూడెంలో జరుగుతుంది. ఇందువల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు. చికిత్సల వార్డు మాత్రం ఇక్కడే ఉంటుంది. శిరీష, డీఎంహెచ్ఓ

# అస్తవ్యస్తం.. ఇన్‌ఛార్జుల పరం

వైరా : రిజిస్ట్రేషన్ శాఖలో అస్తవ్యస్త పరిస్థితులు ఏమాత్రం మారడం లేదు. స్థానికంగా రెండేళ్లుగా సబ్‌రిజిస్ట్రార్‌లు తరుచూ మారడం వారి పనితీరుపై అనేక ఆరోపణలు రావడం పరిపాటిగా మారింది. ఆరోపణలు వచ్చినప్పుడల్లా ఇక్కడున్న వారిని బదిలీ చేయడం ఇతరులకు ఇన్‌ఛార్జుల బాధ్యతలు అప్పగించడం జరుగుతోంది. పదకొండు నెలల నుంచి ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా ఉన్న మోయిజ్ అలీని తాజాగా బదిలీ చేసి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పని చేస్తున్న కరుణకు బాధ్యతలు అప్పగించారు. ఆమె ఇటీవల విధుల్లో చేరారు.

అన్నీ ఆరోపణలే...రెండేళ్ల క్రితం వరకు ఇక్కడ రెగ్యులర్ రిజిస్ట్రార్ కృష్ణయ్య విధులు నిర్వర్తించారు. ఆయన బదిలీ అనంతరం ఇక్కడ ఇప్పటి వరకు ముగ్గురు సబ్‌రిజిస్ట్రార్‌లు పనిచేసి అనేక ఆరోపణలపై బదిలీ అయ్యారు. ఇటీవల వరకు పని చేసిన ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్ వైరా, కొణిజర్ల మండలాల్లో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేశారనే ఆరోపణలపై పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల ముందే ఆయనపై పలు ఆరోపణలు రావడంతో పరిశీలించిన అధికారులు వారం క్రితం ఆయన్ను జిల్లా కేంద్రానికే బదిలీ చేశారు.



రెండేళ్ల క్రితం రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్ బదిలీ అయ్యాక ఇప్పటి వరకు ఇక్కడ వరుసగా సబ్‌రిజిస్ట్రార్ కేడర్ ఉన్న వారిని కాకుండా సీనియర్ అసిస్టెంట్లునే వరుసగా రిజిస్ట్రార్లుగా నియమిస్తుండటం చర్చనీయాంశమైంది. రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్ బదిలీ అయ్యాక రెండేళ్ల క్రితం నియమితులైన సబ్‌రిజిస్ట్రార్ సత్యానందం స్థానికంగానే కాకుండా మధిరలో పనిచేసినప్పుడు వచ్చిన ఆరోపణలతో సస్పెండయ్యారు. అనంతరం నియమితులైన రామ్‌కుమార్ సైతం అనేక ఆరోపణలతో ఆరేడు నెలలకే బదిలీ అయ్యారు. ఏడాదిగా పనిచేస్తున్న మోయిజ్‌అలీ సైతం ఇదే తరహాలో బదిలీ అయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేయడం కారణంతో వాటి బాధితులు ఉన్నతాధికారులను సంప్రదిస్తున్నారు. దీంతో పాటు స్థానికంగా ఉన్న కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగులపై పలు ఆరోపణలు రావడంతో వారిలో ఒకరిపై ఇటీవల రెండు నెలల పాటు జిల్లా కార్యాలయానికి పిలిపించి అధికారులు మందలించారు. అయినా వీరిలో మార్పు రావడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ సైతం సరిగా ఉండటం లేదనే ఆరోపణలున్నాయి.

# బకాయిలు ఎలా బల్దియా?

తాండూరు : మహానగరంలో రూ.వందల కోట్ల అభివృద్ధి పనులపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. జీహెచ్ఎంసీ ఖజానాలో నిధులు లేకపోవడంతో కాలనీల్లో పనులు చేయడానికి గుత్తేదారులు ముందుకు రావడం లేదు. దాదాపు రూ.1100 కోట్ల వరకు గుత్తేదారులకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీంతో కొత్త పనులకు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ముందుకు రావడం లేదు.

గతంలో ధర్నా చేస్తే..: రాజధానిలోని కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, నాలాలు ఇతరత్రా పనులకు బల్దియా ఏటా దాదాపు రూ.500 కోట్ల వరకు వ్యయం చేస్తోంది. మూడేళ్ల కిందటి వరకు పని పూర్తయిన వెంటనే కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించేవారు. దీంతో అప్పట్లో పోటీలు



పడి పనులను దక్కించుకునే వారు. రెండేళ్లుగా బల్దియా ఆర్థిక పరిస్థితి దిగజారడంతో గుత్తేదారులకు బకాయిలను చెల్లించలేని పరిస్థితి. గతంలో బకాయిల కోసం గుత్తేదారులు ధర్నా చేస్తే రూ.300 కోట్ల వరకు విడుదల చేశారు. తాజాగా కాలనీల్లో పూర్తి చేసిన పనులకు రూ.700 కోట్లు, రెండు పడక గదుల ఇళ్లకు రూ.400 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది.

కనీసం రూ. 300 కోట్లు ఇస్తేనే..శాసనసభ ఎన్నికల తరువాత కాలనీల్లో పనులపై జోనల్ అధికారులు ఇటీవల సమీక్ష చేశారు. కొన్నింటికి నాలుగుసార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ముందుకు రాలేదని అధికారులు చెబుతున్నారు. కనీసం రూ.300 కోట్లు బకాయిల కింద చెల్లిస్తే కొత్త పనులు చేపట్టే అవకాశముందని తెలుస్తోంది. దీంతో అనేక కాలనీల్లో గుంతలు పడిన రోడ్లు దర్శనమిస్తున్నాయి. నాలాల విస్తరణ పనుల సంగతి కూడా ఇలానే ఉంది.

## మళ్లీ కొవిడ్ ఘంటికలు.. కొత్త వేరియంట్‌పై 'గాంధీ'లో అప్రమత్తం

హైదరాబాద్: కరోనా కొత్త వేరియంట్ కేసులు దేశ వ్యాప్తంగా పెరుగుతుండటంతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. కరోనా చికిత్సలకు నోడల్ కేంద్రంగా ఉన్న గాంధీ ఆస్పత్రిలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయి. ఎప్పుడు రోగులు వచ్చినా చికిత్సలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు తెలిపారు. ఇందుకు సాధారణ రోగుల కోసం 30 పడకలు, గర్భిణుల కోసం మరో 20 ప్రత్యేకంగా కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటివరకు మన వద్ద అలాంటి కేసులు బయటపడలేదన్నారు. కేరళలో ఒమిక్రాన్ సబ్ వేరియంట్ జేఎన్1 కేసులు పెరుగుతున్న దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేసింది. ఈ దృష్ట్యా గాంధీ ఆసుపత్రిలో సైతం అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ వేరియంట్‌లో జ్వరం, ముక్కు కారడం, గొంతునొప్పి, తలనొప్పి లక్షణాలు ఉంటాయి. కొంతమందిలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తనున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులతో పాటు ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారు.. గుంపుల్లోకి వెళ్లకపోవడం, మాస్క్ ధరించడం అవసరమన్నారు. కేసులు పెరిగితే మళ్లీ టెస్టులు చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

# అల్పాహారానికి ప్రోత్సాహకం

పెద్దపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పరగడుపున ఆకలి తీర్చేందుకు అక్టోబరు 6న 'సీఎం అల్పాహారం' పథకాన్ని ప్రవేశపెట్టారు. మొదట ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన బడుల్లో రోజుకో రకమైన అల్పాహారం పంపిణీ ప్రారంభించారు. అంతకుముందు ఖాళీ కడుపుతో నీరసంగా కూర్చునే పిల్లల్లో పథకం ప్రారంభమయ్యాక ఏకాగ్రత పెరిగి పాఠాలపై పట్టు సాధిస్తున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఇది పేద విద్యార్థులకు వరంగా మారింది. అయితే అందుబాటులో వంట పాత్రలు లేకపోవడం, బిల్లుల చెల్లింపు సక్రమంగా లేక నిర్వాహకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎట్టకేలకు రెండు నెలలకు సంబంధించి బిల్లులు మంజూరు చేస్తూ విద్యాశాఖ రాష్ట్ర సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నిర్వాహకులకు ఆర్థిక భారం తొలగినట్లయింది.

గ్రామీణ విద్యార్థులకు ఉపయుక్తం

సర్కారు బడుల్లో కొన్నేళ్లుగా సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్నారు. ఈ ఏడాది నుంచి రాగి జావ కూడా అందిస్తుండటంతో కొంతవరకు ఆకలి సమస్య తీరింది. మూడు నెలలుగా ఇడ్లీ, గోధుమ



రవ్వ ఉప్మా, పూరీ, ఆలూ కుర్మా, బియ్యం రవ్వ కిచిడీ, చిరుధాన్యాల ఇడ్లీ, పొంగల్, ఉగ్గాని/అటుకులు, కూరగాయల పులావ్, పెరుగు చట్నీ.. రోజుకో రకమైన అల్పాహారాన్ని అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇది చాలా ఉపయుక్తంగా మారింది.

ఉమ్మడి జిల్లాకు రూ.54.83 లక్షలు

ఉమ్మడి జిల్లాలో 3,682 పాఠశాలలున్నాయి. అక్టోబరు నెలలో మండలానికో బడిలో అల్పాహారం పథకాన్ని పారంభించారు. తర్వాత విడతల వారీగా అన్ని చోట్లా అమలు చేస్తున్నారు. అక్టోబరు, నవంబరు నెలలకు సంబంధించి వంట సరకుల బిల్లులతో పాటు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు నెలకు రూ.2 వేల చొప్పున గౌరవ వేతనం కూడా విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో వంట సరకులకు రూ.37,01,242, గౌరవ వేతనం రూ.17,82,000 కలిపి మొత్తం రూ.54,83,242 విడుదలయ్యాయి.

## కొరవడిన అధికారుల పర్యవేక్షణ

సిరిసిల్ల : సిరిసిల్ల పురపాలక సంఘం పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో భవనాల నిర్మాణానికి గాను ఇప్పటివరకు 402 దరఖాస్తులు వచ్చాయి. 328 నిర్మాణాలకు అనుమతులిచ్చారు. 44 ప్రాసెస్‌లో ఉండగా, 30 దరఖాస్తులను తిరస్కరించారు.సిరిసిల్ల పురపాలక సంఘం పరిధిలో ఎక్కడ చూసినా బహుళ అంతస్తుల జోరు కనిపిస్తోంది. భవన నిర్మాణాల సంఖ్య విపరీతంగా పెరిగింది. చిన్న చిన్న వీధుల్లో సైతం మూడు, నాలుగైదు అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. కానీ చాలా వరకు నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడుతున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. ఇంటికి ఆనుకునే కొత్త నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో సూరు నీళ్లు మరో ఇంట్లో పడకూడదని కట్టడి చేసేవారు. ప్రస్తుతం స్లాబులు వేస్తుండగా, స్థలమున్నంత వరకు కట్టుకుంటున్నారు. ఏదైనా ఘటనలు జరిగితే ఎవరు బాధ్యులనే విషయాన్ని మాత్రం పట్టించుకోవడం లేదు. సిరిసిల్లలో నివాసిత భవనంగా అనుమతి తీసుకొని వాణిజ్య అవసరాలకు పలువురు వినియోగిస్తున్నారు. మూడు అంతస్తులు ఉన్న చోట అయితే కింది అంతస్తులో దుకాణాలు, ఇతర కార్యకలాపాలకు అద్దెకు ఇస్తున్నారు. భవనం నాలుగు వైపులా వదలాల్సిన ఖాళీ స్థలంలో ఇతర నిర్మాణాలు చేపడుతున్నారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాధారణంగా భవన నిర్మాణానికి టీఎస్ బీపాస్‌లో అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 21 రోజుల్లో వారికి అనుమతినిస్తారు. ఈలోపు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉంటే భవన నిర్మాణానికి అనుమతిని నిరాకరిస్తారు. కానీ భవన నిర్మాణంలో అధికార యంత్రాంగం పట్టనట్లుగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. టీఎస్ బీపాస్ విధానం వచ్చినప్పటి నుంచి అనుమతుల దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరించడం, ఫిర్యాదులు వస్తే టాస్క్‌ఫోర్స్‌కు అప్పగించడం తప్ప క్షేత్రస్థాయిలో ఎన్ని అంతస్తులకు అనుమతి ఉంది, పార్కింగ్, సెట్బ్యాక్, సెల్లార్, ఏ అవసరాలకు దీనిని వినియోగిస్తున్నారనే విషయాలను గుర్తించడమే మానేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే భవనాల



ను మొదట్లోనే కట్టడి చేయకపోవడంతో ఫిర్యాదులు కూడా పెరిగిపోతున్నాయి. అనుమతులకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణాలు అధికమయ్యాయి. ఒకట్రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని అదనంగా రెండు అక్రమంగా నిర్మించుకుంటున్నారు. పలువురు ప్రజాప్రతినిధులతో మాట్లాడుకొని అధికారులు రాకుండా చూసుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు సైతం అనుమతులకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సెట్బ్యాక్ సైతం పాటించడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం- మీర్జా ఫసహత్ అలీ బేగ్, కమిషనర్, సిరిసిల్ల పురపాలక సంఘంసిరిసిల్ల మున్సిపల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాల గురించి మా దృష్టికి రాగానే నోటీసులు అందిస్తున్నాం. వెంటనే టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందిస్తున్నాం. టాస్క్‌ఫోర్స్ వారు విచారించి చర్యలు తీసుకుంటున్నారు. భవన నిర్మాణానికి దరఖాస్తులు రాగానే టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. సెట్‌బ్యాక్, సెల్లార్ వంటి ఇతర డీవియేషన్లు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటికి అనుమతులను నిరాకరిస్తున్నాం.

# రాయితీ సిలిండర్‌పై ఆశ.. ఈ- కేవైసీకి పరుగులు



తాండూరు : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొంది. ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. ప్రభుత్వం ఏర్పాటైంది. అక్కడనుంచి గ్యాస్ వినియోగదారులు రాయితీ సిలిండర్ నిమిత్తం వేచి చూస్తున్నారు. ఆధార్ అనుసంధానం (ఈ-కేవైసీ) ఉంటేనే ఇస్తారనే నిరాధార ప్రచారం సాగడంతో ఏజెన్సీల వద్ద ఉదయం నుంచే క్యూ కడుతున్నారు. ప్రభుత్వం మాత్రం దీనిపై ఎలాంటి గడువు విధించినట్లు ప్రకటించలేదని అధికారులు వివరిస్తున్నారు. ప్రచారం నమ్మొద్దని కోరుతున్నారు.

పట్టించుకోవడంలేదు

ఉజ్వల యోజన కనెక్షన్లు ఉన్న వినియోగ దారులకు మాత్రమే ప్రస్తుతం ఆధార్ అనుసంధానం చేస్తున్నట్లు కొందరు నిర్వాహకులు తెలిపారు. సాధారణ కనెక్షన్లు ఉన్న వారికి అవసరం లేదని వివరిస్తున్నా వినియోగదారులు మాత్రం పట్టించు కోవడంలేదంటున్నారు. లబ్ధిదారులు, వినియోగదారులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో రూ.500లకే గ్యాస్ సిలిండర్ పొందే విషయంలో ప్రభుత్వం విధి విధానాలను ఖరారు చేయాలనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. జిల్లా వ్యాప్తంగా వివిధ%ర%రకాల గ్యాస్ కనెక్షన్లు కలిపి 1,82,312 ఉన్నాయి.

జిల్లాలో ఉజ్వల యోజన పథకం కింద వీరికి కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేసింది. నిండు గ్యాస్ సిలిండర్ పొందాలంటే వీరు డబ్బులు చెల్లిస్తున్నారు. రాయితీ కింద రూ.350 ఖాతాలో జమౌతున్నాయి. ఇలాంటి వారి కోసమే తాము ఆధార్ అనుసంధానం ప్రారంభించామనీ ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయని తాండూరులోని ఓ గ్యాస్ ఏజన్సీ నిర్వాహకుడు తెలిపారు.

ఇవీ వివరాలు

ఒక సిలిండర్ ఉన్న వినియోగదారులు: 68,503
రెండు సిలిండర్లు ఉన్నవారు: 18,764
వాణిజ్య సిలిండర్లు:3,198
దీపం పథకం:32,257
ఉజ్వల యోజన పథకం: 38,330
సీఎస్ఆర్: 21,260

తుది గడువు ఏమీ లేదు

జిల్లాలోని గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ కోసం ఎలాంటి తొందర పడాల్సిన అవసరం లేదు. దీనికి తుది గడువు అంటూ ఏమీ లేదు. గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లకుండా సొంతంగా ఈ-కేవైసీ పూర్తి చేసుకునేందుకు మొబైల్ యాప్ విడుదల చేశారు. ఇది కాకుండా గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్స్ తమ వద్ద ఉన్న యాప్ ద్వారా కూడా ఈ-కేవైసీ పూర్తి చేస్తారు. తరచుగా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకున్న విధంగానే దీనిని కూడా అప్‌డేట్ చేసుకోవడమే. వేరే ఏమి లేదు.రాజేశ్వర్, జిల్లా పౌర సరఫరాల అధికారి

# కుర్చీలు కదలనున్నాయ్!



హైదరాబాద్: గ్రేటర్‌లోని కీలకమైన ప్రభుత్వ విభాగాల్లో ఏళ్లుగా పాతుకుపోయిన అధికారులు, సిబ్బంది స్థానచలనానికి రంగం సిద్ధమవుతోంది. పలువురు అధికారులు పదేళ్లుగా ఒకేసీటులో ఉంటూ విధుల్లో నిర్లక్ష్యం ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బల్దియా, జలమండలి, హెచ్ఎండీఏ, వైద్యఆరోగ్యశాఖ, రవాణాశాఖ ఇలా అన్ని శాఖల్లో తమదే పైచేయిగా నడిపిస్తున్నారు. వివిధ విభాగాలకు కొత్తగా ఉన్నతాధికారులు వస్తుండటంతో ఇలాంటి అధికారులు, సిబ్బందిని కదిలించేందుకు రంగం సిద్ధమవుతోంది. అంతర్గత బదిలీలు.. డిప్యూటేషన్లపై వచ్చిన వారిని వెనక్కే పంపి పైరవీలకు చెక్‌పెట్టనున్నట్లు చెబుతున్నారు.

ఇవిగో ఉదాహరణలు..బల్దియాలో వివిధ చోట్ల జోనల్ కమిషనర్లు మూడేళ్ల నుంచి విధుల్లో ఉన్నారు. వీరేకాక ప్రణాళిక విభాగంలో కొందరు ఎప్పటినుంచో పాతుకుపోయి పైరవీలు, అక్రమాలకు తెర తీస్తున్నారు. ఇక బిల్ కలెక్టర్లు కొన్ని ప్రాంతాలను సొంత జాగీరుల్లా మార్చుకొని అవినీతిలో మునిగితేలుతున్నారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్లే ఇందుకు ఉదాహరణ.

హెచ్ఎండీఏలో కొందరు అధికారులు ఏళ్లుగా కదలడం లేదు. ఇంజనీరింగ్, ప్రణాళిక విభాగంలో కొందరు ఆడిందే ఆటగా సాగుతోంది. హెచ్ఎండీఏకు కొత్త బాస్ రావడంతో ఇలాంటి వారిపైనా వేటు తప్పదని అంటున్నారు.

రవాణాశాఖలో ఇప్పటివరకు ఓ కీలకాధికారే అంతా తానై నడిపించారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా 9 ఏళ్లుగా చెక్‌పోస్టుల్లో కొందరు ఎంవీఐలు, ఏఎంవీఐలు పాతుకుపోయారు. పైనుంచి అండదండలతో తతంగం నడిపిస్తున్నారు. త్వరలో వీరి జాతకాలు బయట పడనున్నట్లు చెబుతున్నారు.

గ్రేటర్‌లోని కొన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇప్పటివరకు ఓ అధికారి అభయంతో కొందరు ఏళ్లుగా కొనసాగుతున్నారు. సదరు కీలకాధికారిని తప్పించనుండటంతో వీళ్ల కుర్చీలు కూడా కదలనున్నాయి. వారం పది రోజుల్లో కార్యాచరణ మొదలు కానుందని అంటున్నారు.

జలమండలిలో పలు విభాగాల్లో జీఎంలు, డీజీఎంలు ఒకేచోట 10 ఏళ్లు ఆపైనే కొనసాగుతున్నారు. జలమండలికి కొత్త ఎండీ రావడంతో త్వరలో ప్రక్షాళన చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

# ప్రగతి వేదికలకు సొంత గూడు కరవు




సిరిసిల్ల :ప్రజలకు సేవలందించే ప్రభుత్వ కార్యాలయాలకు ఏళ్ల తరబడి సొంత భవనాలు లేక ఇబ్బందిగా మారింది. వివిధ కార్యకలాపాలు, సమావేశాల నిర్వహణకు సమస్యలు ఎదురవుతున్నాయి. సంవత్సరాల కొద్దీ అద్దె భవనాల్లో చాలీచాలని గదులతో కాలం వెళ్లదీస్తున్నారు. కమాన్‌పూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, గ్రంథాలయం, పీఏసీఎస్ కార్యాలయం, గొల్లపల్లి, సిద్దిపల్లి పంచాయతీలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా సొంత భవనాలకు మాత్రం మోక్షం కలగడం లేదు.

ఏళ్ల తరబడి ఇరుకు కష్టాలు

కమాన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. పాత భవనం శిథిలావస్థకు చేరడంతో దానిని ఖాళీ చేసి అద్దె భవనంలోకి మార్చారు. రిజిస్ట్రేషన్లు, ఇతర అవసరాలకు వచ్చే వారితో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. వివిధ రకాల పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇరుకు గదులతో ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చి కొత్తగా నిర్మించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు.

స్థలం లేక జాప్యంసిద్దిపల్లి, గొల్లపల్లి పంచాయతీలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కాలం వెళ్లదీస్తున్నారు. పెద్ద పంచాయతీ అయిన కమాన్‌పూర్‌కు పంచా యతీ భవనం లేకపోవడంతో 2017లో నిర్మాణం చేపట్టి 2023లో పూర్తి చేశారు. 2017లో కొత్తగా సిద్దిపల్లి, గొల్లపల్లి పంచాయతీలు ఏర్పడ్డాయి. సిద్దిపల్లిలో కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతు ండగా, గొల్లపల్లిలో మాత్రం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్నారు. ఉపాధిహామీలో పంచాయతీలకు నూతన భవన నిర్మాణం కోసం రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరైనా సొంత స్థలం లేకపోవడంతో నిర్మాణాలు చేపట్టడం లేదని అధికారులు చెబుతున్నారు.

50 ఏళ్లుగా అవస్థలే..కమాన్‌పూర్‌లోని వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం 50 ఏళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఎరువులు, ఇతర రాయితీ పరికరాలు భద్రపరుచుకునేందుకు సరైన వసతులు లేవు. డైరెక్టర్లతో నిర్వహించే సమావేశాలకు ఇబ్బందిగా మారింది. కమాన్ పూర్, రామగిరి ముత్తారం మండలాల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం నాలుగేళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. నిధులు సమృద్ధిగా ఉన్నా స్థల కొరతతో నిర్మాణం చేపట్టడం లేదు. విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయానికి సైతం సొంత భవనం లేదు. ఇలా మండలంలో అభివృద్ధికి వేదికలుగా మారే కార్యాలయాలకు సొంత భవనాల కొరత వేధిస్తోంది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలోనైనా సొంత భవనాల నిర్మాణాల కళ నెరవేరాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు. నూతన ప్రభుత్వంలో మంథని నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా శ్రీధర్‌బాబు ఉండటంతో సమస్యలు తీరతాయని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# రైతుబంధుకు నిరీక్షణ

కరీంనగర్ : యాసంగి పంట పెట్టుబడి కోసం రైతుబంధు సహాయం కోసం కర్షకులకు నిరీక్షణ తప్పట్లేదు. ముందుగా సన్నకారు రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామన్న ప్రభుత్వ ప్రకటన చిన్న రైతుల్లో ఆశలు పెంచింది. ప్రకటించి వారం అవుతున్నా.. అర్హులైన వారిలో అయిదు శాతం మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ కాలేదు. వ్యవసాయ అధికారుల కార్యాలయాలకు రైతుబంధు సమాచారం కోసం వెళ్లి రావడం రైతుల దినచర్యగా మారింది. ఖాతాల్లో నిధులు జమ కాకపోవడంతో పెట్టుబడి సహాయం కోసం వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలకు ఎరువులు వేయాల్సి ఉందని వాపోతున్నారు.

రూ.9.24 కోట్లే..

జిల్లాలో రైతుబంధుకు అర్హులైన వారు 2,03,096 మంది. వీరందరికి ఈ పంట కాలానికి ఎకరాకు రూ.5 వేల చొప్పున రూ.182 కోట్లు అవసరం. 1,86,663 మంది రైతుల వివరాలు వ్యవసాయ అధికారులు పరిశీలన పూర్తి చేశారు. ప్రభుత్వం రైతుబంధు విడుదల చేయాలని ప్రకటించిన తర్వాత మొదటి దశలో జిల్లాకు 76,963 రైతులకు



సంబంధించి రూ.20,30,10,789ను విడుదల చేస్తున్నట్లు కోశాగార శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌లో చూపించారు కానీ.. వారం తర్వాత 48,809 మంది రైతులకు సంబంధించిన ఖాతాల్లో రూ.9.24 కోట్లు మాత్రమే జమ అయ్యాయి.

ఎకరం ఉన్నా రాలేదు!

గతంలో ఒక ఎకరం లోపు ఉన్న వారికి ముందు రోజు, తర్వాత రెండో రోజు రెండు ఎకరాలున్న వారికి నిధులు ఖాతాల్లో జమ అయ్యేవి. ఇప్పటి వరకు పరిశీలిస్తే గుంటలల్లో భూమి ఉన్న వారికి తప్ప ఎకరం ఉన్న వారిలో అందరికీ నిధులు జమ కాలేదు. జిల్లాలో సుమారు 70 వేల మంది రైతులు ఒక ఎకరం ఆ లోపు ఉన్న వారే ఉన్నా ఇప్పటి వరకు 48,809 మందికే జమ అయినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే..- వాసిరెడ్డి శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి రైతుబంధు నిధులు ప్రభుత్వ నిర్ణయం ప్రకారం విడుదల అవుతున్నాయి. జిల్లా నుంచి అర్హులైన వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. ఎన్ని ఎకరాల వరకు ఎన్ని నిధులు విడుదల చేస్తారన్న సమాచారం లేదు.

## మిన్నంటిన సన్నాలు..!

చౌటుప్పల్ : జిల్లాతో పాటు హైదరాబాద్‌లో సన్న బియ్యం ధరలు అమాంతం పెరిగాయి. సీజన్‌కు సీజన్‌కు మధ్య తీవ్ర వ్యత్యాసం కన్పిస్తుంది. గత వానాకాలంతో పోల్చితే ఇప్పటికే రూ.500 వరకు పెరిగింది. ప్రధాన నగరాలు, పట్టణాల్లో వినియోగదారులు బియ్యం ధరలు సామాన్యులను గుబేలుమనిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో సన్నరకాల సాగు తగ్గడంతో పాటు అధికంగా సన్నబియ్యం వాడకం పెరగడంతో ధరలకు రెక్కలొచ్చాయని అంచనా. సన్నబియ్యం వినియోగించే వారి సంఖ్య ఏటేటా పెరుగుతోంది. డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతో ధరలు పెరుగుతున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి వారు సన్నబియ్యం ధరలు వింటేనే ఉలిక్కిపడుతున్నారు. ఏడాది క్రితం సాంబ మసూరి బియ్యం క్వింటాలు రూ.4800 ఉండగా, అంతకు ముందు బియ్యం రూ.5600 పలుకుతున్నాయి. పచ్చి ధాన్యం స్టీం వేసి నిల్వ చేసి అవసరమైనపుడు మిల్లింగ్ చేసి బియ్యంగా మార్చుతుంటారు. ఇక జైశ్రీరాం (చింటు) రకం బియ్యం ధర కొత్తవి రూ.6200, పాతవి రూ.6600 పలుకుతున్నాయి. ఈ ధర కేవలం ఉమ్మడి జిల్లాలోనే ఇలా ఉంది. ప్రధాన పట్టణాలలో వీటి ధర రూ.7000 నుంచి రూ.7500 వరకు ఉంది.

ఎందుకింత పెరగడం

సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని 3.90 లక్షల ఎకరాల్లో 3.40 లక్షల ఎకరాల వరకు సన్న రకాలే సాగు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో సన్న రకాల సాగు చాలా తక్కువ. రెండేళ్లుగా వేసిన పంట తెగుళ్లు, వర్షాలు, గాలి దుమారాలకు పడిపోయి దెబ్బతిని సరైన దిగుబడి రావడం లేదు. ఇటీవల వానాకాలంలో తుపాన్ వల్ల వేలాది ఎకరాల్లోని వరికి నష్టం వాటిల్లింది.

ఆ పొలాల్లో కేవలం 25 బస్తాలే దిగుబడి వచ్చింది. వర్షాలు లేక, సాగునీరు అందక ఎండిపోయి అరకొర నీటితో పండిన పంట సైతం 20 బస్తాలు దిగుబడి దాటలేదు. అందుకే మిల్లర్లు పోటీ పడి ధాన్యం కొనుగోలు చేశారు. మిల్లులు నడవాలంటే ధాన్యం ఇపుడు కొంటేనే సరి.. లేదంటే తర్వాత దొరకదు. మిల్లు ఆగిపోతే తీవ్ర నష్టం ఉంటుంది. దీంతో ప్రభుత్వ మద్దతు ధర రూ.2200 కంటే ఆరేడు వందల రూపాయలు అదనంగా చెల్లించి కొనుగోలు చేశారు. మిర్యాలగూడ మిల్లుల్లో రూ.2700 నుంచి రూ.3200 వరకు కొనుగోలు చేశారు. అలా పెంచిన ధాన్యం ధరల ప్రభావం బియ్యంపై పడుతోంది. ప్రస్తుతం మిర్యాలగూడ, నల్గొండ, కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల నుంచి తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, తదితర రాష్ట్రాలకు పంపిస్తున్నారు. దీనికి తోడు కర్ణాటకలో కొత్తగా ఈ ప్రాంత వ్యాపారులు మిల్లులు ఏర్పాటు చేయడంతో అక్కడికి మన రాష్ట్రం నుంచి ధాన్యం తరలిస్తున్నారు. దాంతో మన రాష్ట్రంలో, జిల్లాలో బియ్యం ధరలు పెరిగిపోతున్నాయి. స్టీం వేయడంతో ధాన్యం నిల్వ చేస్తున్నారు. అవసరమైతే కృత్రిమ కొరత సృష్టించడానికి అవకాశం ఉంటుంది. మన రాష్ట్రంలో సన్నరకాలు కేవలం మిల్లర్లే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఐకేపీల ద్వారా దొడ్డు రకాలే తప్ప సన్నరకాలు కొనుగోలు చేయడం లేదు. అందుకే బియ్యం ధరలపై నియంత్రణ ఉండటం లేదు. బియ్యం ధరలు తగ్గించేలా మిల్లర్లపై ఒత్తిడి తేవడం కష్టం. ఎందుకంటే రైతులకు గిట్టుబాటు ధర ఇస్తుండటంతో రైతులు ఆనందంగా ఉంటున్నారు. అదనంగా వరి సాగుచేసి మిల్లులు నడవడానికి పరోక్షంగా సహకారం అందిస్తున్నందున వారిని ఏమీ అనలేని పరిస్థితి ఉంది. రైతులు సాగు పెంచితే కొంతమేర తగ్గడానికి ఆస్కారం ఉంటుంది.

ధరలు తగ్గాలంటే..

ఉమ్మడి నల్గొండ జిల్లాలో సన్నరకాల ధాన్యం పండించే సాగు విస్తీర్ణం పెరగాలి. ఇక్కడ మిల్లులకు సరిపడా ధాన్యం పండించడంతో పాటు అదనంగా ఇతర ప్రాంతాలకు తరలించే సామర్థ్యం పెరగాలి. దాదాపు ఉమ్మడి జిల్లాలో 12 లక్షల ఎకరాల్లో వరి సాగవుతున్నట్లు అంచనా. అందులో 80 శాతం సన్నరకాలు సాగుచేస్తే కొంతమేర బియ్యం ధరలు తగ్గే అవకాశం ఉంది. దీంతో పాటు ఇతర రాష్ట్రాలకు బియ్యం తరలింపు నిలువరించాలి. అపుడే బియ్యం ధరలకు కళ్లెం వేయడానికి ఆస్కారం ఉంటుంది.

# రహదారుల కోత.. ఎన్నాళ్లీ వెత

భూపాలపల్లి : గత నెలలో కురిసిన కుండపోత వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లోని ప్రధాన రోడ్లతో పాటు గ్రామీణ ప్రాంత రహదారులు అధ్వానంగా మారాయి. అడుగడుగునా మోకాలు లోతు గుంతలతో ద్విచక్రవాహనదారులు అవస్థలు పడుతున్నారు. తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.గత నెలలో కురిసిన కుండపోత వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లోని ప్రధాన రోడ్లతో పాటు గ్రామీణ ప్రాంత రహదారులు అధ్వానంగా మారాయి. అడుగడుగునా మోకాలు లోతు గుంతలతో ద్విచక్రవాహనదారులు అవస్థలు పడుతున్నారు. తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్ వరకు 23 కి.మీ వరకున్న రోడ్డు అధిక వర్షాల కారణంగా రాంపూర్ నుంచి నాగారం మీదుగా ఆజంనగర్ వరకు అనేక ప్రాంతాల్లో గుంతలు పడటంతో చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారిపై నుంచి భూపాలపల్లి మండలంతో పాటు మహాముత్తారం మండలంలోని సుమారు పది అటవీ గ్రామాలకు పైగా ప్రయాణికులు వెళ్తుంటారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు కొనసాగుతాయి.కాశీంపల్లి గ్రామ శివారు నుంచి గొర్లవీడు వరకు రోడ్డు పలు ప్రాంతాల్లో గుంతలు పడటంతో వాహనాల రాకపోకలకు



తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. నాచారం వరకు రోడ్డు కూడా అధిక వర్షాలతో పలు ప్రాంతాల్లో కోతకు గురైంది. ఈ రోడ్డు మార్గం నుంచి నాచారం, తాడ్వాయి, మల్లయ్యపల్లి గ్రామాల నుంచి కాశీంపల్లి మీదుగా భూపాలపల్లికి చేరుకుంటారు. రహదారి మరమ్మత్తు పనులు చేపట్టాలని పలు అటవీ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ గ్రామ శివారు నుంచి ఆముదాలపల్లి గ్రామానికి చెందిన రోడ్డు గుంతల మయంగా మారింది. కమలాపూర్ గ్రామ సమీపంలోని సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంతంలో మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. చిన్నపాటి వర్షం పడినా గుంతల నిండా నీరు నిలిచి ద్విచక్రవాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారి మధ్యలోని లోలెవల్ కల్వర్టు పైపులు ధ్వంసం కావడంతో వాహనదారులకు గండంగా మారింది.

భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు నుంచి మల్హర్ మండలం అనుసాన్‌పల్లి గ్రామ శివారు నుంచి జంగేడు గ్రామం మీదుగా భూపాలపల్లికి చేరుకుంటారు. గత నెలలో కురిసిన వర్షాల కారణంగా అనుసాన్‌పల్లి గ్రామ సమీపంలోని వట్టేవాగు ప్రాంతంలో వరద తాకిడికి తారు రోడ్డు కోతకు గురికావడంతో వాహనాల రాకపోకలు కొద్ది రోజులుగా నిలిచిపోయాయి. ధ్వంసమైన రోడ్డు విషయమై సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లినా కనీసం మరమ్మతు చేపట్టకపోవడంతో అనుసాన్‌పల్లి గ్రామ సర్పంచి జగన్ సొంతంగా ట్రాక్టర్‌తో మొరం పోయించడంతో తాత్కాలికంగా రాకపోకలు కొనసాగుతున్నాయి.రేగొండ మండలంలో భారీ వర్షాలతో కోతకు గురైన రావులపల్లి, పాండవుల గుట్ట రహదారులు మరమ్మతుకు నోచుకోవడం లేదు. గత నెలలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు తిర్మలగిరి శివారు రావులపల్లి నుంచి నారాయణపురం గ్రామాల మధ్య వంతెన రెండు వైపులా వరద తీవ్రతకు రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. పాండవుల గుట్టకు వెళ్లే బీటీ రోడ్డు కల్వర్టు వద్ద పెద్ద బుంగ పడింది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..


– తిరుపతి, పీఆర్ ఏఈ, భూపాలపల్లిమండలంలోని పలు గ్రామాల్లోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గ త రోడ్లు గత నెలలో కురిసిన అధిక వర్షాలతో దెబ్బతిన్నాయి. మరమ్మతు పనుల కోసం నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభిస్తాం.

# మంచంపట్టిన పల్లెలు

తిర్యాణి : జిల్లాలో జ్వరాలు ప్రబలుతున్నాయి. డయేరియా, టైఫాయిడ్, మలేరియా, డెంగీ తదితర వాటితో పాటు సాధారణ, వైరల్ జ్వరాలతో చాలామంది ప్రజలు విలవిల్లాడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. కొంతమందిలో తెల్లరక్త కణాలు తగ్గుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. మరో వైపు జిల్లాలో రెండో ఏఎన్ఎంల నిరవధిక సమ్మెతో గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణపై ప్రభావం పడుతోంది.చాలా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ గాడి తప్పింది. మురుగు కాలువల్లో పూడిక నిండి దోమలు బెడదతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చాలా గ్రామాల్లో ఇంటికి ఒకరిద్దరు జ్వరాలతో బాధపడుతున్నారు. కొన్ని గ్రామీణ ప్రాంత ఆరోగ్య కేంద్రాల్లో రోజుకు 20– 30 మంది వచ్చే ఓపీ(అవుట్ పేషంట్) 70–100 వరకు పెరిగింది. దీంతో ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏజెన్సీ పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. జ్వర పీడితులను గుర్తించి రక్తపూతలు సేకరిస్తున్నారు. 783 గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి 23,649 మందిని పరీక్షించగా.. 2591 మందికి జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారిలో 13 మలేరియా, 11 టైఫాయిడ్, మిగిలిన సాధారణ జ్వరాలుగా గుర్తించి వైద్య సేవలందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సుమారు వందకు పైగా రెండో ఏఎన్ఎంలు వారం రోజులుగా నిరవధిక సమ్మెకు దిగడంతో గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇది వరకు రోజుకు 30–35 శిబిరాలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 15–20కి పడిపోయింది.

ఇంటికి ఒకరిద్దరు బాధితులు..కొన్ని గ్రామాల్లో జ్వర బాధితులు వారం పదిరోజులుగా మంచానికే పరిమితమై తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళుతున్నా.. అక్కడ అంతంత మాత్రమే పరీక్షిస్తున్నారని... రోజుల తరబడి జ్వరం తగ్గకపోవడంతో మళ్లీ ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని వాపోతున్నారు. తిర్యాణి మండలంలో చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అక్కడి పీహెచ్‌సీకి ఇది వరకు రోజుకు 20–25 వరకు వచ్చే ఓపీ.. వారం రోజులుగా 70–100కి పెరిగింది. మట్టపక్కల గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని కోమటిచావడిలో సుమారు 20 కుటుంబాల్లో ఇంటికి ఒకరిద్దరు జ్వరాలతో మంచానికి పరిమితమయ్యారు.

# కోతలకు సన్నద్ధం.. కొనుగోలుకు సమాయత్తం



వరంగల్ : జిల్లాలో వానాకాలం సీజన్ వరి కోతలు మొదలయ్యాయి. వ్యవసాయ మార్కెట్‌లకు రైతులు ధాన్యం తీసుకొస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయడం కోసం జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేపట్టింది. వచ్చే నెల నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఏర్పాట్లపై జిల్లా పాలనాధికారి ప్రావీణ్య సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించి తగిన సూచనలు చేశారు.

3,23,808 మెట్రిక్ టన్నుల దిగుబడి..

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 1,34,920 ఎకరాల్లో రైతులు వరి సాగుచేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. సుమారు 3,23, 808 మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని అంచనా వేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా గతేడాది ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే.. ఈ ఏడాది 3,913 ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం తగ్గింది. వచ్చే దిగుబడిలో స్థానిక వినియోగం కోసం 48,571 మెట్రిక్ టన్నులు, విత్తన వినియోగానికి 3,238 మెట్రిక్ టన్నులు పోతుందని, మార్కెట్‌కు వచ్చిన ధాన్యంలో మిల్లర్లు 71,999 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. మిగిలిన 2 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ సిద్ధం అవుతోంది.

199 కేంద్రాలు..

జిల్లాలో ఈసారి 199 కొనుగోలు కేంద్రాల ద్వారా 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబరులో 88,399 మెట్రిక్ టన్నులు, డిసెంబరులో 90,267, జనవరిలో 21,334 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో 53, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 123 కేంద్రాలు, జీసీసీ తరపున ఒకటి, ఇతర ప్రాంతాల్లో 22 కేంద్రాల ద్వారా కొనుగోలు చేయనున్నారు.

మద్దతు ధర..: నాణ్యత ప్రమాణాల ప్రకారం ధాన్యంలో తేమశాతం 17లోపు ఉంటే గ్రేడ్ ఏ రకానికి క్వింటా రూ.2,060, సాధారణ రకానికి క్వింటా రూ.2,040 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది.

వీటిపై దృష్టిసారించాలి.. కొనుగోలు కేంద్రాల్లో తరచూ లారీలు ఆలస్యం కావడంతో ధాన్యం మిల్లులకు తరలించడానికి ఇబ్బందులు ఎదురవుతుంటాయి. తగినన్ని వాహనాలను సమకూర్చుకోవాలి.

జిల్లా వ్యాప్తంగా సుమారు 200 వరకు లారీల అవసరం ఉంటుంది. కొనుగోలు కేంద్రాల్లో హమాలీ ఛార్జీలను భిన్నంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. హమాలీ ఛార్జీల విషయంలో అధికారులు దృష్టిసారించాల్సిన అవసరముంది.

కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట దోపిడీని అరికట్టాలి.

కొనుగోలు తర్వాత రైతుల ఖాతాలో ధాన్యం డబ్బుల జమ జాప్యాన్ని నివారించాలి.

ప్రతిసారి గన్నీ సంచుల సమస్య ఎదురవుతోంది. ఎక్కువగా చిరిగిన, రంధ్రాలు పడిన సంచులు ఇస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు. హమాలి, దడవాయి, కూలీ ఛార్జీల కింద క్వింటాలుకు రూ.22 రైతులు భరిస్తున్నారు. దీన్ని ప్రభుత్వమే చెల్లించాలి.

తరుగు పేరుతో దోపిడి..:

–వరికెల సాంబశివరావు, రైతు, నర్సంపేట

కొనుగోలు కేంద్రాల్లో తాలు, మట్టి పేరుతో బస్తాకు రెండు కిలోలు అదనంగా తూకం వేస్తున్నారు. తీరా మిల్లులకు పంపించాక ధాన్యం బాగ లేదని, తేమగా ఉంది మిల్లర్లు బస్తాకు 3–5 కిలోల వరకు కోత పెట్టి కాంటా వేసుకుంటున్నారు. అదేంటంటే తీసుకొనేది లేదని, ఎక్కడైనా అమ్ముకోండని చెబుతున్నారు. మార్కెట్ యార్డులో ఏ గ్రామం రైతు సరకు తెచ్చినా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

నవంబరు రెండోవారం నుంచి కొనుగోళ్లు..

– సంధ్యారాణి, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు వచ్చేనెల రెండో వారం నుంచి ప్రారంభించనున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఇప్పటికే కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా దృష్టిసారించాం. ఎన్నికల నేపథ్యంలో ప్రవర్తన నియమావళి మేరకు నిబంధనలు పాటిస్తాం. కొత్త టెండర్లు పిలవకుండా.. పాత వారికే ధాన్యం రవాణా ఇస్తాం.

# నిత్యాన్నదానానికి మోక్షమెప్పుడో!

వరంగల్ : పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి ఆలయం రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటి. ఏటా ఫిబ్రవరి లేదా మార్చి మాసంలో ఇక్కడ మహాశివరాత్రికి స్వామివారి బ్రహ్మోత్సవాలు, మహాజాతరను వైభవంగా నిర్వహిస్తారు. ఉమ్మడి వరంగల్, నల్గొండ, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. అంతటి ప్రాధాన్యం ఉన్న ఈ ఆలయంలో శాశ్వత నిత్య అన్నదాన సత్రం ఏళ్లుగా అమలుకు నోచుకోవడం లేదు. ఏటా దాతలు ఆర్థిక సాయం చేస్తున్నా ఇప్పటికి భవన సముదాయ నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. దీంతో భక్తులకు నిత్యం తిప్పలు తప్పడం లేదు.

ఆదాయం ఉన్నా.. నిర్మాణం పూర్తి కాదు

సోమేశ్వరాలయానికి ఏటా సుమారు రూ.1.20 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఏటా ఐదు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల సమయంలో లక్ష మంది భక్తులొస్తారు. నిత్యాన్నాదానం పేరిట దేవస్థానం 2013 నుంచి విరాళాలు సేకరిస్తోంది. ఇప్పటి వరకు భక్తులు సుమారు రూ.30 లక్షల వరకు అందించారు. ఆలయం తరపున బ్యాంకులో కొంత నిధులు జమ చేస్తున్నారు. అవి కూడా రూ.లక్షల్లోనే ఉన్నాయని తెలుస్తోంది. ఇక నిత్య అన్నదానం కోసం నిర్మిస్తున్నా భవన సముదాయం ఐదేళ్లుగా అసంపూర్తిగానే ఉంది. 2017లో అప్పటి ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్ రూ.10 లక్షల నిధులు కేటాయించారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణి కూడా రూ.5 లక్షలు నిర్మాణానికి అందించారు. ఈ నిధులు సరిపోక దాతల నుంచి విరాళాలు సేకరించి నిర్మాణానికి వెచ్చించారు. అయినా ఇప్పటికి భవన నిర్మాణం పూర్తి కాలేదు.

గత ఈవోలను అడిగి తెలుసుకుంటా

– లక్ష్మీప్రసన్న, ఈవో సోమేశ్వరాలయం

శాశ్వత నిత్యాన్నాదానం కోసం నిర్మిస్తున్నా భవన సముదాయం ఇంకా అసంపూర్తిగానే ఉంది. పూర్తయితేనే నిర్వహణ సిబ్బంది, అమలు సాధ్యా అసాధ్యాలపై నిర్ణయాలు తీసుకుంటాం. ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తా. అలాగే ముందస్తుగా సిబ్బందిని నియమించుకోవాల్సి ఉంటుంది. చాలా పనులుంటాయి. ప్రతి సోమవారం భక్తులు ఆలయానికి ఎక్కువగా వస్తుంటారు. పాత ఈవోలను అడిగి మరింత సమాచారం తెలుసుకుంటా.

ఎవరికీ పట్టింపు లేదుశాశ్వత నిత్య అన్నదాన కార్యక్రమం అమలు చేయడానికి దేవస్థానం ఏమాత్రం ముందస్తు అడుగులు వేయడం లేదని భక్తులు, స్థానికులు గుసగుసలాడుతున్నారు. నిధులున్నా అసంపూర్తి భవన నిర్మాణానికి అధికారులు, తాత్కాలిక పాలక మండలి సభ్యులు పట్టింపు లేనట్లుగానే వ్యవహరిస్తున్నారు. అమలు నిర్వహణ సిబ్బందిని ముందస్తుగా నియమించుకోవడం లేదు. ఇవి కూడా నిత్య అన్నదానం ప్రారంభానికి అడ్డంకులుగా మారాయని చెప్పవచ్చు. అసంపూర్తి భవన నిర్మాణంపై దేవాదాయ, ఇతర శాఖ అధికారులను వివరణ కోరగా నిధులు ఉన్న మేర పనులు చేయించామన్నారు. అనంతరం ప్రైవేటు వ్యక్తులు కట్టిస్తున్నారని, తమకు ఎలాంటి సంబంధం లేదని వారు సమాధానం చెబుతున్నారు.

# ‘యూడైస్’లో నమోదైతేనే పరీక్షలకు..!

భూపాలపల్లి: బోగస్ విద్యార్థుల ఏరివేతకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నిగ్గు తేల్చేందుకు అధికారులు దృష్టి సారించారు. విద్యార్థుల హాజరు పట్టికకు, ఏకీకృత జిల్లా పాఠశాల విద్యా సమాచారం(యూడైస్) మధ్య తేడా లేకుండా సరిచేసేందుకు తాజాగా పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన ఇటీవల సంబంధిత జిల్లాల విద్యాశాఖ కార్యాలయాలకు ఉత్తర్వులు జారీ చేశారు. పదో తరగతి పరీక్షలకు హాజరు కాబోయే విద్యార్థుల వివరాలు యూడైస్‌లో తప్పనిసరిగా నమోదై ఉండాలనేది ఈ ఉత్తర్వుల సారాంశం. ఇందులో నమోదైన పదో తరగతి విద్యార్థులు మాత్రమే 2023–24 విద్యా సంవత్సర పరీక్ష ఫీజు చెల్లించేందుకు అర్హులుగా ప్రకటించింది. ఈ నెల 28 లోగా ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులందర్నీ విధిగా యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాలని ఆదేశించింది. అనుమతి లేని పాఠశాలల నుంచి కూడా కొందరు ప్రైవేటు పాఠశాలల నిర్వహకులు విద్యార్థుల ప్రవేశాలు తీసుకొని అనధికారికంగా పదో తరగతులను నడిపిస్తున్నారు. ఆఖరు సమయంలో తమ విద్యార్థులకు మరో పాఠశాల నుంచి పరీక్ష ఫీజు చెల్లించే వారు. అక్కడి నుంచే నామినల్ రోల్స్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగానికి అందించే వారు. ఈ తతంగానికి అడ్డుకట్ట వేసేందుకే. ఈసారి విద్యార్థులను యూడైస్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించింది. ఈ నెలాఖరులోగా ఆన్‌లైన్‌లో నమోదైన వారే పరీక్ష ఫీజు చెల్లించేందుకు అర్హులుగా ప్రకటించింది. దీంతో అనుమతి పొందని ప్రైవేటు పాఠశాలల అటకట్టించడంతో పాటు విద్యార్థుల లెక్కను పక్కాగా తేల్చేందుకు రంగం సిద్ధం చేసింది.

ఫీజులు చెల్లించినప్పుడే..విద్యాశాఖ ఉత్తర్వులతో.. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలతోపాటు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కొందరు హైరానా పడుతున్నారు. అనధికారికంగా పదో తరగతి ప్రవేశాలు పొందిన ప్రైవేటు వారు వెంటనే విద్యార్థులను మరో పాఠశాలలో నమోదు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే ముఖ గుర్తింపు విధానం ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్(ఎఫ్ఆర్ఎస్)లో విద్యార్థులు హాజరు నమోదు ప్రారంభమవడంతో రిజిస్టర్‌లో పేరుండి దీర్ఘకాలికంగా పాఠశాలలకు రాని విద్యార్థుల పేర్లను తొలగించి, ఆన్‌లైన్ డ్రాప్ బాక్స్‌లో వేసేందుకు యోచిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పడిపోకుండా ఉండేందుకు తొమ్మిదో తరగతి నుంచి ఇప్పటి వరకు హాజరుకాని వారు కూడా రిజిస్టర్‌తో పాటు యూడైస్‌లో నమోదై ఉన్నారు. విద్యార్థుల సంఖ్యతో ఉపాధ్యాయుల పోస్టుల సంఖ్య ముడిపడి ఉండటంతో కొందరు ఈ విధానాన్ని కొనసాగిస్తున్నారు. పది పరీక్ష ఫీజు చెల్లించే సమయంలో వీరి పేర్లను తొలగించి ఆన్‌లైన్ డ్రాప్ బాక్స్‌లో వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ ఏడాది జిల్లాలో పదో తరగతి పరీక్షలకు ఎంతమంది హాజరు కానున్నారో ఫీజులు చెల్లించినప్పుడే లెక్క తేలుతుందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

నమోదు ఎలా చేయాలంటే..విద్యార్థి వ్యక్తిగత పూర్తి వివరాలను యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారం.. విద్యార్థి పేరు. పుట్టిన తేదీ, తరగతి, తల్లి తండ్రుల పేర్లు, ఆధార్ సంఖ్య, చిరునామా, చరవాణి సంఖ్య, ఆర్థిక స్థితి, కులం, ప్రస్తుత పాఠశాల, గతంలో చదివిన పాఠశాల తదితర సమచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదైన ఈ వివరాలనే నామినల్ రోల్‌లో తీసుకుంటారు.

గడువులోగా నమోదు చేయాలిపదో తరగతి విద్యార్థులందరినీ విధిగా యూడైస్‌లో నమోదు చేయించాలని అత్యవసర సమాచారంగా చేరవేశాం.

# ఆశపెడతారు.. అందినకాడికి దోచేస్తారు

ఖమ్మం : పెట్టుబడి పెడితే లాభం వస్తుందని ఎస్ఎంఎస్ పంపగా బూర్గంపాడు మండలానికి చెందిన ఓ వ్యక్తి నమ్మారు. తన ఖాతా నుంచి రూ.10వేలు, రూ.20వేలు ఇలా విడతల వారీగా రూ.3.50 లక్షలు పంపించారు. తర్వాత సమాచారం రాకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు.ఖమ్మం నగరానికి చెందిన ఒక మహిళ చరవాణికి ఎస్ఎంఎస్ వచ్చింది. వివరాలు నమోదు చేస్తే లాటరీ ద్వారా అత్యధిక నగదు బహుమతి పొందవచ్చునని నమ్మించారు. సదరు మహిళ లింక్‌పై క్లిక్ చేసి వ్యక్తిగత వివరాలు పొందుపరిచాక తొలుత రూ.10వేలను ఫలానా ఖాతాలో జమచేయాలని మరో ఎస్ఎంఎస్ వచ్చింది. నమ్మి రూ.10వేలు జమచేస్తే అవతలి వ్యక్తి నుంచి స్పందన లేదు.రోజురోజుకూ సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఏమరుపాటుగా ఉంటే బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. పేద, ధనిక తేడా లేకుండా జనాలను ఉచ్చులో బిగించి ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ప్రచారం చేస్తున్నా సైబర్ నేరగాళ్లు కొత్తతరహా



మోసాలకు తెరలేపుతున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో నెలకు సగటున 30 కేసులు నమోదవుతుండటం కలవరపరుస్తోంది.

అప్రమత్తతతో ఆట కట్టు

స్మార్ట్‌ఫోన్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు చెలరేగుతున్నారు. కాస్త అప్రమత్తంగా ఉంటే మోసగాళ్ల ఆట కట్టించవచ్చునంటున్నారు పోలీసులు. సైబర్ క్రైం జరిగిందని తెలిసిన వెంటనే 1930 నంబరుకు ఫోన్‌చేస్తే ఏ బ్యాంకు ఖాతాలో డబ్బులు జమైతే ఆ ఖాతాను పోలీసులు నిలుపుదల చేస్తారు. బ్యాంకు ఖాతా వివరాలతో నేరస్థుణ్ని పట్టుకోవడానికి అవకాశం ఉంటుంది. 1930 నంబరుకు డయల్ చేయడంతో పాటు సమీప ఠాణాలో ఫిర్యాదు పత్రం అందించాలి.

ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ ద్వారా..

సైబర్ క్రైం జరిగిన వెంటనే ఎన్‌సీఆర్‌పీ (నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్)లో వివరాలు నమోదు చేయాలి. అంతకుముందు ఈ పోర్టల్‌లో ఫోన్ నంబర్ సహాయంతో లాగిన్ కావాలి. ఐడీ నమోదవుతుంది. తర్వాత ఎప్పుడైనా, ఎక్కడైనా పోర్టల్‌లోనే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. సైబర్ క్రైం జరిగిన ప్రదేశం, సమీపంలోని పోలీస్‌స్టేషన్ వివరాలను పొందుపరచగానే సంబంధిత పోలీసులు తక్షణం స్పందిస్తారు. అంతేకాకుండా ఆడపిల్లలు, మహిళలు లైంగిక వేధింపులకు గురైనా ఈ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.ప్రజల నుంచి సైబర్ క్రైం కేసు వివరాలు అందగానే చర్యలు తీసుకుంటున్నాం. జనం అప్రమత్తంగా ఉంటే చాలావరకు మోసాలను నివారించవచ్చు. ముఖ్యంగా ఫోన్‌కు వచ్చే లింకులను ఓపెన్ చేయటం, బ్యాంకు కస్టమర్ కేర్ నుంచి అని చెప్పి మాట్లాడే వారికి ఖాతా వివరాలు ఇవ్వటం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయటం, ఓటీపీలు ఇతరులకు చెప్పడం వల్ల మోసపోయే ఆస్కారముంది. శ్రావణ్, ఐటీ కోర్ ఎస్సై, కొత్తగూడెం

# ప్రగతి.. ప్రతిపాదనలకే పరిమితం

గోదావరిఖని : దళిత వాడలు, గిరిజన తండాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చేపట్టిన సర్వే కాగితాలకే పరిమితమైంది. ప్రభుత్వ ఆదేశాలతో ఆగమేఘాలపై క్షేత్ర స్థాయికి వెళ్లిన అధికారులు ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించారు. సిమెంటు రహదారులు, మురుగు కాలువలు, విద్యుత్తు స్తంభాలు, తాగునీటి సరఫరా తదితర సమస్యలను గుర్తించారు.

అవసరమైన నిధుల మంజూరుకు ప్రతిపాదించి రెండేళ్లు దాటినా పైసా నిధులు కేటాయించలేదు. దీంతో కాలనీల్లో కష్టాలు తీరతాయని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. మరోవైపు వర్షాకాలంలో బురదమయంగా మారిన రహదారులపై నరకయాతన తప్పడం లేదు. మురుగు కాలువ వ్యవస్థ లేక దుర్గంధంతో జీవనం సాగించాల్సి వస్తోంది. జిల్లాలోని 452 దళిత, 28 గిరిజన తండాలు కలిపి మొత్తం 480 ఆవాసాల్లో రూ.128.88 కోట్లకు సంబంధించి ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి.

ప్రాధాన్య క్రమంలో నమోదు

జిల్లాలో 266 పంచాయతీల్లో సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా ఎస్సీ సామాజిక వర్గ జనాభా 1,54,855. ఇందులో 77,311 మంది పురుషులు, 77,544 మంది మహిళలున్నారు. ఎస్టీల జనాభా 14,945 కాగా 7,520 మంది పురుషులు, 7,425 మంది మహిళలున్నారు. పంచాయతీ సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో సమస్యలపై ఆరా తీశారు. ఎక్కడెక్కడ ఎలాంటి వసతులు అవసరమనే విషయమై ప్రజల అభిప్రాయాలు తీసుకున్నారు. సిమెటు రహదారులు, మురుగు కాలువలు, వీధి దీపాలు, ప్రమాదకర విద్యుత్తు వ్యవస్థ, తాగునీటి పైపులైన్ల నిర్మాణం, లీకేజీల వంటి వాటిపై ప్రాధాన్య క్రమంలో నమోదు చేసుకున్నారు.

రహదారులు.. విద్యుత్తు సరఫరా

దళిత, గిరిజన ఆవాసాల్లో ప్రధానంగా సిమెంటు రహదారులకు సంబంధించి 2301 పనులకు రూ.50.11 కోట్ల నిధులతో ప్రతిపాదించారు. 787 కొత్త నల్లా కనెక్షన్లు, 243 లీకేజీ నల్లాలున్నట్లు గుర్తించారు. జిల్లావ్యాప్తంగా 1,26,098 మీటర్ల మేర ఎల్‌టీ లైన్, 442 మధ్యస్థ స్తంభాల బిగింపు, 58 ఒరిగిన, 168 విరిగిన స్తంభాలు, 11 కేవీ 188, ఎల్‌టీ(ఇళ్లలోకి వచ్చే విద్యుత్తు తీగలు) లైన్ల తొలగింపు కోసం నివేదించారు. 57 చోట్ల డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల(డీటీఆర్) సామర్థ్యం పెంపు, 68 డీటీఆర్‌లు అదనంగా అవసరమవుతుందని నిర్ధారించారు.

సమస్యలతో సహవాసంమౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల కోసం అధికారులు పంపిన ప్రతిపాదనలు అటకెక్కాయి. రాష్ట్రంలో హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో ఆ నియోజకవర్గంలో తప్ప మిగిలిన ప్రాంతాల్లో ఇప్పటికీ పైసా నిధులు మంజూరు చేయలేదు. ప్రతి సంవత్సరం వానాకాలంలో గుంతలు, బురదమయవుతున్న రహదారులతో ప్రజలకు నరకయాతన తప్పడం లేదు. మురుగు కాలువ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో దుర్గంధం వెదజల్లి వ్యాధులు ప్రబలుతున్నాయి. అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలకు నిధులు మంజూరు కాలేదని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తే పనులు చేస్తామని పేర్కొంటున్నారు.

# 'అవి కేవలం ఆరోపణలే'.. భారత్‌లో వివక్షపై ప్రధాని మోదీ స్పందన

దిల్లీ: భారత్‌లో కొన్ని వర్గాలపై వివక్ష చూపుతున్నారనే వాదనను ప్రధాని మోదీ తోసిపుచ్చారు. ఈ మేరకు ఆంగ్లపత్రిక 'ఫైనాన్షియల్ టైమ్స్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యలు చేశారు. భారత్‌లోని మైనార్టీ వర్గాలపై వివక్ష గురించి అడిగిన ప్రశ్నకు మోదీ సమాధానమిచ్చారు. భారత జనాభాలో అతి తక్కువ శాతం ఉన్న పార్సీ ప్రజల ఆర్థిక ప్రగతిని ఉదహరించారు. అలాగే, కొన్ని మైనార్టీ వర్గాలు తమ జీవనానికి భారత్ సురక్షితమైన దేశంగా భావించి ఇక్కడే స్థిరపడ్డాయన్నారు. భారతీయ సమాజం ఏ మతం, మైనార్టీ వర్గంపై వివక్ష చూపటం లేదని స్పష్టం చేశారు. భారత్‌లో మైనార్టీలను అణిచివేస్తున్నారన్న విమర్శలపై కూడా ప్రధాని మోదీ స్పందించారు. వివిధ రకాల వేదికలపై విమర్శకులు తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వెల్లడిస్తారు. అలాంటప్పుడు ఆరోపణలకు సమాధానం చెప్పి.. వాటిని ఖండించే హక్కు కూడా అవతలి పక్షానికి ఉంటుందని ప్రధాని గుర్తుచేశారు. భారత్‌లో ప్రజాస్వామ్యం బలహీనంగా ఉందన్న విమర్శలను ప్రధాని తోసిపుచ్చారు. అలాంటి ఆరోపణలు చేయడం అంటే.. ప్రజాస్వామ్య విలువలపై పౌరులకున్న నిబద్ధతను చులకన చేసినట్లే అని అన్నారు. అదే విధంగా దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు భాజపా కట్టుబడి ఉందన్నారు. గత దశాబ్ద కాలంలో భారత్ అభివృద్ధి పథంలో సాగిందనే విశ్వాసం ప్రజల్లో నెలకొందని ప్రధాని తెలిపారు.

**ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంపై** ఇజ్రాయెల్‌తో సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తూనే.. గాజాకు అవసరమైన మానవతా సాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని మోదీ తెలిపారు. "ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం కారణంగా గాజాలో నెలకొన్న పరిస్థితులపై ఇరు దేశాల నాయకులతో తరచుగా చర్చిస్తూనే ఉన్నాం. ఆ ప్రాంతంలో శాంతి నెలకొల్పేందుకు భారత్ తన వంతు కృషి చేసేందుకు సిద్ధంగా ఉంది" అని ప్రధాని మోదీ తెలిపారు. పాలస్తీనా విషయంలో భారత్ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదని ఆయన పునరుద్ఘాటించారు.






# ఏపీలో దొంగ ఓట్లపై చర్యలు తీసుకోండి: పార్లమెంట్‌లో గల్లా జయదేవ్

దిల్లీ: ఆంధ్రప్రదేశ్ ఓటర్ల జాబితాలో అక్రమాలు, దొంగ ఓట్ల వ్యవహారంపై పార్లమెంట్‌లో తెదేపా ఎంపీ గల్లా జయదేవ్ (%+ఖశ్రీశ్రీఖ జీఖఝుఎవజ%) గళం విప్పారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామకం, విధివిధానాల బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. "కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు ఏపీలో ఎక్కడా సరిగ్గా అమలు కావడం లేదు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడం ఈసీ ప్రధాన విధి. కానీ, రాష్ట్రంలో ఆ విధమైన పరిస్థితి కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించే విషయంలో ఈసీ ఇచ్చిన ఆదేశాలను డీఆర్‌వోలు, స్థానిక సిబ్బంది ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఒత్తిళ్లకు లొంగి జాబితాలో మార్పులు చేస్తున్నారు. ఇదే విషయంపై తెదేపా అధినేత చంద్రబాబు నేతృత్వంలో నేతలు ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు కూడా చేశారు. ఓటర్ల జాబితా నుంచి తెదేపా సానుభూతిపరులు, కార్యకర్తల ఓట్లు తొలగిస్తున్నారనే ఫిర్యాదులో ఆధారాలతో వివరించారు. ఏపీలో ఎన్నికల అక్రమాలను నిరోధించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వెంటనే స్థానికులతో సంబంధం లేని అధికారుల పర్యవేక్షణలో ఓటర్ల జాబితా రూపొందించడంపై దృష్టి సారించాలి. ఓటర్ల జాబితాలో లోపాలు ఉన్నాయంటే.. కింది స్థాయి అధికారులపైకి ఉన్నతాధికారులు నెపం నెట్టేస్తున్నారు. సుమారు 10 లక్షల ఫిర్యాదులు చేసినా.. వాటిని పట్టించుకోలేదు. తుది ముసాయిదా జాబితా విడుదల చేసిన సందర్భంలో 13 లక్షలకు పైగా దొంగ ఓట్లు ఉన్నాయని గుర్తించినట్లు ఎన్నికల సంఘం అధికారులు చెప్పారు. దొంగ ఓట్లు ఉన్నాయని అధికారికంగా ప్రకటించిన తర్వాత కూడా.. అందుకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు ఎందుకు ఆలోచిస్తున్నారు? ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకోవాలి. పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించే విధంగా చర్యలు చేపట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి" అని ఎంపీ గల్లా జయదేవ్ కోరారు.




# మూకుమ్మడి సస్పెన్షన్లు.. పార్లమెంట్ నుంచి విపక్ష ఎంపీల నిరసన ర్యాలీ

దిల్లీ: ప్రస్తుతం జరుగుతోన్న పార్లమెంట్ సెషన్‌లో 143 మంది విపక్ష ఎంపీలపై వేటుపడిన సంగతి తెలిసిందే. ఈ మూకుమ్మడి సస్పెన్షన్లపై గురువారం ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు నిరసన ర్యాలీ చేపట్టారు. పార్లమెంట్ భవనం నుంచి సెంట్రల్ దిల్లీలోని విజయ్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రాసిన బ్యానర్, ప్లకార్డులను ప్రదర్శించారు.

ఈ ర్యాలీని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముందుండి నడిపించారు. అధికార భాజపాకు ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని ఆయన విమర్శించారు. "భద్రతా వైఫల్యంపై చర్చించడానికి అనుమతి ఇవ్వాలని లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్‌ను కోరుతున్నాం. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా దీనిపై పార్లమెంట్‌లో ప్రకటన చేయాలి. ప్రధాని లోక్‌సభ మినహా బయట మీడియాతో, సభల్లో దీని గురించి మాట్లాడారు. భద్రతా వైఫల్యం ఘటన ఎందుకు జరిగింది..? ఎవరు బాధ్యులు..?" అని ఖర్గే ప్రశ్నించారు. 'ఇండియా' కూటమికి చెందిన సభ్యులు శుక్రవారం జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేపట్టనున్నారని ఆయన చెప్పారు.

డిసెంబర్ 13న పార్లమెంట్‌లో చోటుచేసుకున్న భద్రతా వైఫల్యం ఘటనపై కేంద్ర హోం మంత్రి ప్రకటన చేయాలని గతవారం నుంచి విపక్ష సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. దాంతో నాటి నుంచి వరుసగా ఉభయ సభల ఎంపీలపై సస్పెన్షన్ల వేటు పడుతోంది. ఇప్పటి వరకు ఆ సంఖ్య 143కు చేరింది. మరోవైపు బుధవారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య (బీఎస్).. బిల్లులకు ఆమోదం లభించింది.




బెంగళూరు: శీతాకాల పార్లమెంట్ సమావేశాల వేళ లోక్‌సభలోకి ఇద్దరు దుండగులు దూసుకొచ్చిన ఘటన తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. దీనిపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో బెంగళూరుకు చెందిన ఓ టెకీని దర్యాప్తు బృందాలు అదుపులోకి తీసుకొన్నాయి. అతడు కర్ణాటక పోలీసు శాఖలో పనిచేసిన ఓ మాజీ ఉన్నతాధికారి కుమారుడు సాయికృష్ణ జగాలి అని పోలీసు వర్గాలు వెల్లడించాయి. రిటైర్డ్ డీఎస్పీ కుమారుడైన సాయి.. లోక్‌సభలో అలజడి సృష్టించిన మనోరంజన్‌కు స్నేహితుడు. వారిద్దరూ బెంగళూరులోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బ్యాచ్‌మెట్స్. విచారణలో భాగంగా మనోరంజన్ చెప్పిన వివరాల ఆధారంగా బుధవారం సాయంత్రం సాయికృష్ణను.. బాగల్‌కోటెలోని అతడి ఇంటి నుంచి అదుపులోకి తీసుకున్నారు. అతడిని దిల్లీకి తరలించి విచారించనున్నారు. తాజా పరిణామాలపై సాయి సోదరి మీడియాతో మాట్లాడారు. 'దిల్లీ పోలీసులు వచ్చి, నా సోదరుడిని ప్రశ్నించారు. మేం ఈ విచారణకు పూర్తిగా సహకరించాం. నా సోదరుడు, మనోరంజన్ ఒకే ఇంట్లో ఉండేవారు. నా సోదరుడు ఇప్పుడు ఇంటి నుంచి పనిచేస్తున్నాడు. అతడు ఎలాంటి తప్పు చేయలేదు' అని తెలిపారు. పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం ఘటనలో పోలీసులు ఇప్పటి వరకు ఆరుగురిని అరెస్టు చేశారు. నిందితులు మనోరంజన్, సాగర్ శర్మ..డిసెంబర్ 13న లోక్‌సభలోకి దూసుకువచ్చి కలకలం సృష్టించారు. అమోల్ శిందే, నీలమ్ ఆజాద్.. పార్లమెంట్ వెలుపల ఆందోళన చేపట్టారు. మరో నిందితుడు లలిత్ ఝా.. ఈ ఘటన మొత్తానికి సూత్రధారి అని, అతడికి మహేశ్ కుమావత్ సహకరించాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.




హమాస్‌ను సమూలంగా నాశనం చేయడమే లక్ష్యంగా గాజాలో భీకర భూతల దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయెల్‌దళాలు.. ఆ ముఠా నెట్‌వర్క్‌ను ఛేదిస్తున్నాయి. తాజాగా గాజా సిటీలో హమాస్ అతిపెద్ద కమాండ్ సెంటర్ బయటపడింది.

దీని నుంచే హమాస్ తమ భూగర్భ సొరంగ నెట్‌వర్క్ మొత్తాన్ని నిర్వహిస్తున్నట్లు ఐడీఎఫ్ తెలిపింది. అయితే, ఈ కమాండ్ సెంటర్ ఎక్కడ గుర్తించిందో మాత్రం ఇజ్రాయెల్ వెల్లడించలేదు.

**మరో ఒప్పందానికి హమాస్ తిరస్కరణ..** ఇదిలా ఉండగా, బందీల విడుదల కోసం మరో ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ప్రతిపాదించగా.. హమాస్ దాన్ని తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం వెల్లడించింది. హమాస్ చెరలో ఉన్న మరో 40 మంది విడుదల కోసం 7 రోజుల ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే, గాజా పట్టీలో ఇజ్రాయెల్ తమ దాడులను పూర్తిగా నిలిపివేస్తేనే సంధిపై తాము చర్చిస్తామని మధ్యవర్తిగా ఉన్న ఈజిప్టు ప్రతినిధులకు హమాస్ చెప్పినట్లు సదరు కథనం పేర్కొంది. అంతేగాక, ఇజ్రాయెల్ జైళ్లలోని పాలస్తీనా ఖైదీలందరినీ అప్పగిస్తే.. బందీలను విడిచిపెడతామని హమాస్ షరతు పెట్టినట్లు తెలుస్తోంది. అటు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా దీనిపై స్పందించారు. సమీప భవిష్యత్తులో ఇజ్రాయెల్-హమాస్ మధ్య డీల్ జరిగే అవకాశాలు కన్పించట్లేదని అన్నారు. అయితే, ఒప్పందం కోసం తాము ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే యూఎస్ సీఐఏ, ఇజ్రాయెల్ మొస్సాద్, ఖతార్ ప్రధాని సమావేశం కానున్నట్లు పేర్కొన్నారు.

**పోరాటం అంటే అది కాదు: మేక్రాన్ –** మరోవైపు, గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న దాడులపై అంతర్జాతీయంగా కొంత వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దాడుల్లో సామాన్య పౌరుల మరణాలపై పలు దేశాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. ఇజ్రాయెల్ వెనక్కి తగ్గాలని సూచిస్తున్నాయి. తాజాగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మేక్రాన్ దీనిపై స్పందిస్తూ ఇజ్రాయెల్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం అంటే.. గాజాను పూర్తిగా నేలమట్టం చేయడమో లేదా సామాన్యులపై విచక్షణారహితంగా దాడులు చేయడమో కాదు. తమ దేశాన్ని రక్షించుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉంది. కానీ, సామాన్యుల ప్రాణాలు కూడా ముఖ్యమే. గాజాలో దాడులను వెంటనే ఆపాలని మేం కోరుకుంటున్నాం. కాల్పుల విరమణ, మానవతా సాయం కోసం ఒప్పందం జరగాలి" అని మేక్రాన్ అన్నారు.

**గాజాలో 20వేలకు చేరిన మృతులు..** అక్టోబరు 7 నాటి హమాస్ దాడికి ప్రతీకారంగా గాజాపై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఈ దాడుల్లో గాజా వైపు ప్రాణనష్టం భారీగా ఉంది. ఇప్పటి వరకు 20వేల మంది గాజావాసులు మరణించినట్లు అక్కడి ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మృతుల్లో దాదాపు 8వేల మంది చిన్నారులే. ఇక గాజాలో భూతల దాడులు ప్రారంభించినప్పటి నుంచి ఇజ్రాయెల్ వైపు 130 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది.

# సీఎం వైయస్ జగన్‌కు బర్త్ డే విషెస్ తెలిపిన ప్రధాని మోదీ



అమరావతి: ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ట్విట్టర్ ద్వారా సీఎం వైయస్ జగన్‌ను విష్ చేశారు. సీఎం వైయస్ జగన్ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ప్రధాని ఆకాంక్షించారు సీఎం వైయస్ జగన్ పుట్టిన రోజు పురస్కరించుకుని గురువారం రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో భారీఎత్తున సేవా కార్యక్రమాలను వైయస్ఆర్‌సీపీ శ్రేణులు చేపట్టాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో మొక్కలు నాటడంతో పాటు అన్నదానం, వస్త్రదానాలు చేస్తున్నారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్నారు. రక్తదాన శిబిరాలు కూడా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు.

**గవర్నర్ శుభాకాంక్షలు..** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ కూడా ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి హృదయపూర్వకంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పేదల జీవితాల్లో వెలుగు తెచ్చిన నాయకుడు సీఎం జగన్: సజ్జల

తాడేపల్లి: వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, ఎంపీ నందిగం సురేష్, పలు కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, సామాజిక న్యాయం అమలు చేసిన ఘనత జగన్‌దేనన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి.. పేదల జీవితాల్లో వెలుగు తెచ్చిన నాయకుడు జగన్ అని పేర్కొన్నారు. "తండ్రిని మించిన తనయుడిగా జగన్ పాలన అందిస్తున్నారు. పూర్తి పారదర్శకంగా సంక్షేమం పథకాలు అందించిన ఘనత జగన్‌దే. అవినీతికి తావులేకుండా, అర్హత ఉన్న ప్రతీఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాం" అని సజ్జల పేర్కొన్నారు. "తండ్రికి మించిన తనయుడుగా జగన్ పేరు తెచ్చుకున్నారు. పేదల చేయి పట్టుకుని నడిపిస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆస్పత్రులు ఇలా అన్నీ అందుబాటులోకి తెచ్చారు. అన్నీ కళ్లముందే కనిపిస్తున్నాయి. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్నారు. జగన్ పాలన పారదర్శకంగా జరుగుతోంది. వచ్చే ఎన్నికల కోసం మారీచశక్తులు మళ్లీ ఏకం అయ్యాయి. గతంలో మోసం తప్ప ప్రజలకు ఇంకేమీ చేయలేదు. ప్రజల కష్టాలు, కన్నీళ్ళు చూశానని లోకేష్ అంటున్నారు. మరి మంత్రిగా చేసినప్పుడు




అవి కనపడలేదా?. అధికారంలో ఉన్న మిమ్మల్ని ప్రజలు ఈడ్చి కొట్టారు. అయినాసరే మళ్ళీ ప్రజలను నమ్మించేందుకు మళ్ళీ ప్రయత్నాలు చేస్తున్నారు. ఎల్లో మీడియాని అడ్డుపెట్టుకుని ప్రజలను భ్రమల్లో ఉంచుతున్నారు" అంటూ సజ్జల మండిపడ్డారు. సీఎం జగన్ పుట్టిన రోజు పురస్కరించుకుని గురువారం రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో భారీఎత్తున సేవా కార్యక్రమాలను వైయెస్సార్‌సీపీ శ్రేణులు చేపట్టాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో మొక్కలు నాటడంతో పాటు అన్నదానం, వస్త్రదానాలు చేస్తున్నారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్నారు.


రక్తదాన శిబిరాలు కూడా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియాలో సీఎం జగన్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి

# నారా లోకేష్‌ను అభినందించిన చంద్రబాబు

అమరావతి: యువగళం పాదయాత్రను దిగ్విజయంగా నిర్వహించిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఆ పార్టీ అధినేత చంద్రబాబు ట్విటర్ వేదికగా అభినందించారు. నిన్న నిర్వహించిన యువగళం – నవశకం సభను పరిశీలిస్తే ఏపీ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని స్పష్టంగా తెలుస్తోందన్నారు.

ప్రజా సమస్యలపై చేస్తున్న పోరాటానికి మద్దతు పలికిన జనసేన అధినేతకు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర పునర్వైభవాన్ని ప్రజలు కోరుకుంటున్నారని తెలిసిపోతోందన్నారు.

టీడీపీ, జనసేన పొత్తుపై ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారని తెలిపోయిందని నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్ష లు మేరకు రాష్ట్ర పునర్నిర్మాణానికి రెండు పక్షాలు కట్టుబడి ఉ




ంటాయని చంద్రబాబు పేర్కొన్నారు. యువగళం – నవశకం బహిరంగ సభలో పాల్గొన్న వారందరికీ ప్రత్యేకంగా చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో మార్పు కోసం ప్రజలు నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు.

# మంచు కన్నప్పకి జోడీ సెట్

మంచు విష్ణు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తూ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం కన్నప్ప. ఈ చిత్రం విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ అనే విషయం తెల్సిందే. సుదీర్ఘ కాలంగా విష్ణు ఈ ప్రాజెక్ట్ గురించిన చర్చలు జరుపుతున్నాడు. ఎట్టకేలకు సినిమా షూటింగ్ ప్రారంభం అయింది. యూనిట్ సభ్యులు సినిమాకి సంబంధించిన మొదటి షెడ్యూల్ ను విదేశాల్లో చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాలో మోహన్ బాబు, మోహన్ లాల్, ప్రభాస్ ఇంకా ఎంతో మంది టాలీవుడ్, బాలీవుడ్ పాన్ ఇండియా స్టార్స్ గెస్ట్ పాత్రల్లో కనిపించబోతున్నారు అంటూ వార్తలు వస్తున్నాయి. ఆ విషయమై త్వరలోనే క్లారిటీ వస్తుందని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక కన్నప్ప సినిమాలో లేడీ లీడ్ రోల్ లో నటించేది ఎవరు అంటూ చాలా రోజులుగా చర్చ జరుగుతోంది. మొదట ఆ పాత్రకు గాను స్టార్ హీరోయిన్ కృతి




సనన్ సోదరి నుపుర్ సనన్ ను హీరోయిన్ గా నటింపజేసేందుకు చర్చలు జరిపారు. ఆమె డేట్లు ఇవ్వలేని పరిస్థితి నేపథ్యం లో మరో హీరోయిన్ ని రంగంలోకి దించబోతున్నారు. కన్నప్ప సినిమాలో హీరోయిన్ గా ప్రీతి ముకుందన్ ను నటింపజేస్తున్నట్లుగా అధికారికంగా ప్రకటన వచ్చింది. క్లాసికల్ డాన్సర్ అయిన ప్రీతి ముకుందన్ మోడలింగ్ లో సుదీర్ఘ కాలంగా కొనసాగుతూ వస్తోంది. ఆమె కన్నప్ప సినిమాకు మంచి ఎంపిక అనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. కన్నప్ప షూటింగ్ ను విదేశాల్లో చేస్తున్న సమయంలో విష్ణు కు గాయం అయ్యిందనే వార్తలు వచ్చాయి. త్వరలోనే మళ్లీ సినిమా షూటింగ్ ను విదేశాల్లోనే మొదలు పెట్టే అవకాశాలు ఉన్నాయి. సినిమాలో లేడీ సూపర్ స్టార్ నయనతార గెస్ట్ రోల్ లో కనిపించే అవకాశాలు ఉన్నాయి అంటూ వార్తలు వస్తున్నాయి. ఆ విషయమై కూడా క్లారిటీ రావాల్సి ఉంది.

# అందాల పులి ఓర చూపు కవ్వింపు

ఊహలు గుసగుసలాడే సినిమాతో హీరోయిన్ గా మంచి గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ రాశి ఖన్నా. నటిగానే కాకుండా అందం విషయంలోనూ అందరి ప్రశంసలు అందుకునే విధంగా ఈ అమ్మడు కెరీర్ ఆరంభంలోనే చాలా కష్టపడి బరువు తగ్గిన విషయం తెల్సిందే. బరువు తగ్గిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా టైర్ 2 హీరోలకు మోస్ట్ వాంటెడ్ గా వరుస సినిమాలు చేసింది. ప్రస్తుతం తమిళ సినీ ఇండస్ట్రీలో బిజీ బిజీగా ఉన్న ఈ అమ్మడు టాలీవుడ్ లో మాత్రం కాస్త స్లో అయిందని చెప్పాలి. ప్రస్తుతం ఒకటి రెండు తెలుగు సినిమాల చర్చలు జరుగుతున్నాయని.. త్వరలో క్లారిటీ వచ్చే అవకాశం ఉ




ందని తెలుస్తోంది. రెగ్యులర్ గా ఈ అందాల రాశి తన అందమైన ఫోటోలను తన ఫాలోవర్స్ కి సోషల్ మీడియా జనాలకు ఎంటర్ టైన్ చేసేందుకు గాను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు తన అందమైన ఫోటోలను షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈసారి బ్లాక్ అండ్ వైట్ పిక్స్ ను షేర్ చేసిన రాశి ఖన్నా పులి చర్మం మాదిరిగా ఉన్న ఒక డిజైనర్ డ్రెస్ ను ధరించి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

ఈ రేంజ్ అందం కేవలం అందాల రాశి కే సొంతం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అందాల పులి ఓర కంట చూస్తూ కవ్విస్తోంది. ఈ ఫోటోలకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు.




# 'నా సామీ రంగ' అంజి గాడి అల్లరే అల్లరి..




సోగ్గాడే చిన్నినాయనా, బంగార్రాజు వంటి సినిమాలతో సంక్రాంతి సెంటిమెంట్ ను బాగా వాడుకున్న నాగార్జున మళ్ళీ ఇప్పుడు నా సామిరంగా.. అనే చిత్రంతో కూడా అదే ఫార్ములాతో నటిస్తున్న విషయం తెలిసిందే. 2024 సంక్రాంతికి ఎలా అయినా రిలీజ్ చేస్తామని చెబుతున్న సినిమా మేకర్స్.. శరవేగంగా షూటింగ్ పనులను కొనసాగిస్తున్నారు. రీసెంట్ గా ప్రమోషన్లను కూడా స్టార్ట్ చేశారు. ఇక నాగార్జునతోపాటు కీలక పాత్ర పోషిస్తున్న అల్లరి నరేశ్ అంజి పాత్రను పరిచయం చేశారు. అంజిగాడు వచ్చేహెడు సూసారా.. సూసెయ్యండి... సూసెయ్యండి.. లేదంటే మాటోచ్చేత్తాది.. అంటూ అల్లరి నరేశ్.. సోషల్ మీడియాలో తన గ్లింప్స్ ను షేర్ చేశారు. పక్కా మాస్ బీట్ కు అంజిగాడి డ్యాన్స్ తో మొదలైన గ్లింప్స్.. తెగ ఆకట్టుకుంటోంది. పల్లెటూరి గెటప్ లో నరేశ్ అల్లరి మాములుగా లేదు. ఎవరు ఏమడిగినా మాటొచ్చేత్తాది అంటూ నరేశ్ అనడం చాలా సరదాగా అనిపిస్తోంది. సినిమాలో నాగార్జున, అల్లరి నరేశ్ మధ్య కెమిస్ట్రీ పాయింట్ హైలెట్ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గ్లింప్స్ మధ్యలో నాగార్జునతో కలిసి డ్యాన్స్ చేయడం, బుగ్గ మీద కిస్ చేసే వంటి సీన్స్ తెగ ఆకట్టుకుంటున్నాయి. చివరగా.. సైకిల్ ను అల్లరి నరేశ్ తొక్కుతుండగా నాగార్జున వెనుక కూర్చుని పొలం గట్ల మీద షాట్ తో గ్లింప్స్ ముగించారు. అయితే ఈ సినిమా రిలీజ్ డేట్ ను ఇంతవరకు మేకర్స్ ప్రకటించలేదు. జనవరి 12వ తేదీ లేదా 14వ తేదీన ఈ మూవీ రిలీజ్ చేయనున్నట్లు సమాచారం. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. పవన్ కుమార్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. నాగార్జునకు జోడీగా ఆషికా రంగనాథ్ నటిస్తున్నారు. యంగ్ హీరో రాజ్ తరుణ్ కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. మలయాళం పోరంజు మరియం సినిమాకు నా సామిరంగా రీమేక్ అని నెట్టింట చర్చ జరుగుతోంది. అయితే ఇదే రీమేక్ కాదని దర్శకుడు విజయ్ బన్నీ చెబుతూ వస్తున్నారు. కానీ విజువల్స్ మాత్రం ఆ స్టోరీకి దగ్గరగానే ఉన్నాయని నెటిజన్లు చెబుతున్నారు. అయితే హీరోల ఇమేజ్ ను దృష్టిలో ఉంచుకుని మేకర్స్ కొన్ని మార్పులు చెసినట్లు సమాచారం. మరి ఈ సినిమా సంక్రాంతి ఫెస్టివల్ ను ఎంతవరకు ఉపయోగించుకుంటుందో చూడాలి.

# హనీమూన్ ఎక్స్ ప్రెస్.. కింగ్ స్టాంప్ వేసేశాడు..!




జోనర్ ఏదైనా సరే ప్రేక్షకుల మెప్పుపొందే ప్రయత్నంలో ఈమధ్య టాలీవుడ్ మేకర్స్ రకరకాల ప్రయోగాలు చేస్తున్నారు. కంటెంట్ తో సినిమా చేస్తే ఎంకరేజ్ చేసేందుకు ఆడియన్స్ ఎప్పుడూ సిద్ధమే. అందుకే ఇప్పుడు న్యూ ఏజ్ ఫిల్మ్ మేకర్స్ అంతా కూడా తమ సినిమాలను సరికొత్త పంథాలో తెరకెక్కిస్తున్నారు. ఇలాంటి ప్రయత్నంతోనే వస్తున్న మరో సినిమా హనీమూన్ ఎక్స్ ప్రెస్. న్యూ ఏజ్ రొమాంటిక్ ఎంటర్టైనర్ గా కామెడీతో పాటుగా సోషల్ మెసేజ్ తో కూడా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ ని కింగ్ నాగార్జున రిలీజ్ చేశారు. ఈ సర్ రియల్ రొమాంటిక్ కామెడీ సినిమాను NRI ఎంటర్టైన్మెంట్స్, న్యూ రీల్ ఇండియా ఎంటర్టైన్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్ లో కె.కె.ఆర్, బాల రాజ్ కలిసి ఈ మూవీ నిర్మిస్తున్నారు. చైతన్య రావు, హెబ్బా పటేల్ లీడ్ జంటగా నటిస్తున్న హనీమూన్ ఎక్స్ ప్రెస్ సినిమాను బాల రాజశేఖరుని డైరెక్ట్ చేస్తున్నారు. తణికెళ్ల భరణి, సుహాసిని ఈ సినిమాలో కీ రోల్స్ పోశిస్తున్నారు. ఈ సినిమాకు కళ్యాణి మాలిక్ మ్యూజిక్ అందిస్తున్నారు. హనీమూన్ ఫస్ట్ లుక్ పోస్టర్ ను కింగ్ నాగార్జున బిగ్ బాస్ తెలుగు సీజన్ 7 సెట్ లో రిలీజ్ చేశారు. తనకు బాల చాలా తెలుగు. అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిలిం & మీడియాలో అతను డీన్ గా పనిచేశారని అన్నారు. హాలీవుడ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎక్స్ పోజర్ ని అన్నపూర్ణ స్టూడెంట్స్ తో పంచుకున్నారని అన్నారు. అతని వల్ల చాలా మందికి ప్రొఫెషనల్ వర్క్ ఎక్స్ పీరియన్స్ వచ్చిందని చెప్పారు. హనీమూన్ ఎక్స్ ప్రెస్ ఒక మంచి ఎంటర్టైన్మెంట్ తో పాటుగా స్ట్రాంగ్ సోషల్ మెసేజ్ తో వస్తుందని అన్నారు. కల్యాణి మాలిక్ మెలోడీస్ క్యాచీగా రొమాంటిక్ గా ఉంటాయి. హనీమూన్ ఎక్స్ ప్రెస్ సినిమా సూపర్ హిట్ అవుతుందని బలంగా నమ్ముతున్నానని అన్నారు నాగార్జున. డైరెక్టర్ బాల రాజశేఖరుని మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా హాలీవుడ్ సినిమాలకు పనిచేశాను ఎప్పటి నుంచో తెలుగు సినిమా చేయాలని అనుకుంటున్నా ఇన్నాళ్లకు అది కుదిరిందని అన్నారు. తనని ఇండియాకు తీసుకొచ్చిన అమల అక్కినేనికి థాంక్స్ చెప్పారు బాల. తనని డీన్ గా తీసుకుని టాలీవుడ్ లోకి ఎంటర్ అయ్యేలా చేశారు. నాగార్జున కూడా అన్ని విధాలుగా గ్రేట్ సపోర్ట్ అందించారు. హనీమూన్ ఎక్స్ ప్రెస్ ఫ్యామిలీ వాల్యూస్ తో పాటుగా ఆరోగ్యకరమైన హ్యూమర్ తో వస్తుందని అన్నారు.

# హన్సికలో బ్యూటీకి హద్దులే లేవే!

ఆపిల్ బ్యూటీ హన్సిక బ్యూటీని వర్ణించడం ఎలా సాధ్యం. కెరీర్ ప్రారంభమై రెండు దశాబ్ధాలు అవుతున్నా! ఇప్పటికీ అదే బ్యూటీని మెయింటెన్ చేస్తుంది. అమ్మడి అందంలో ఇసుమొత్తు కూడా మార్పు రాలేదు అంటే అతిశయోక్తి కాదేమో. అదే స్కిన్ టోన్..అదే వెయిట్...అవే కొలమనాలు. రూప లావణ్యంలో చిన్న మార్పు కూడా చోటు చేసుకోలేదు. మధ్యలో కాస్త చబ్బీలుక్ లో ట్రాన్సఫర్ అయినా అటుపై మళ్లీ సన్నజాజి సోయగంలా మారిపోయి మునిపటి కశ్మీర్ ఆపిల్ అందంలోకి వచ్చేసింది. టాలీవుడ్ లో సినిమాలకు దూరమైనా ఇప్పటికీ అదే బ్యూటీతో ప్రేక్షకుల్ని అలరిస్తుంది. రేర్ గా అనువాద చిత్రాలతో అభిమానుల్ని ఆకట్టుకుంటుంది. కోలీవుడ్ లో మాత్రం అమ్మడి కెరీర్ కి తిరుగు లేకుండా ముందుకు సాగిపోతుంది. ఓవైపు



కమర్శియల్ సినిమాలు చేస్తూనూ మరోవైపు లేడీ ఓరియేటెడ్ నాయిక గానూ సత్తా చాటుతోంది. బాలీవుడ్ లో రెండు..మూడు సినిమాలు చేసినా అక్కడా పెద్దగా కలసి రాలేదు. దీంతో రెండు పడవల ప్రయాణం చేసి రెండిటికీ చెడ్డ రేవడి అవ్వడం దేనికని కోలీవుడ్ లో కెరీర్ ని చూజ్ చేసుకుంది.చెన్నైలోనే కాపురం ఉంటూ అక్కడే సీరియస్ గా సినిమాలు చేస్తోంది. తాజాగా హన్సిక సిరీస్ నుంచి ఓ కొత్త ఫోటో ఇన్ స్టాలోకి వదిలింది. ఇదిగో ఇక్కడిలా అమ్మడు వీపు అందాల్ని ఆవిష్కరించి సిగ్గు..బిడియం ఒలకబోస్తుంది.

అమ్మడు డిజైన్డ్ డ్రెస్ లో ఇలా లిఫ్ట్ లో కెమెరాకి చిక్కింది. డిజైనర్ మ్యాచింగ్ యాక్సరసీస్..నెయిల్ పాలీస్..చెవి దిద్దులు ప్రతీది హన్సికని మరింత అందంగా తీర్చిదిద్దాయి. యాపిల్ బ్యూటీని ఇలా చూసి అభిమానులు ప్రేమని కురిపిస్తున్నారు. అమ్మడి అందాన్ని పొగిడే కవులైపోతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. ఇక అమ్మడు చాలా గ్యాప్ తర్వాత 'మై నేమ్ ఈజ్ శృతి' అనే చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించబోతుంది. ఈ వారంలోనే సినిమా ఆ సినిమా రిలీజ్ అవుతుంది.

# ఎల్లో లో మెరిసి పోతున్న పక్కా కమర్శియల్ బ్యూటీ

రవితేజ హీరోగా నటించిన నేనింతే సినిమాలో హీరోయిన్ గా నటించిన ముద్దుగుమ్మ అదితి గౌతమ్ అలియాస్ సేయా గౌతమ్ సినిమాల్లో పెద్దగా సందడి చేయకున్నా కూడా సోషల్ మీడియాలో మాత్రం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. దాదాపు అయిదు లక్షల మంది ఫాలోవర్స్ ను కలిగి ఉన్న ఈ అమ్మడు రెగ్యులర్ గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఆ మధ్య పక్కా కమర్షియల్ సినిమాలో నటించిన ఈ అమ్మడు మళ్లీ బిజీ అవుతుందని అంతా భావించారు. కానీ ఆ సినిమా ఈ అమ్మడికి వరుస ఆఫర్లను తెచ్చి పెట్టలేక పోయింది. అయినా నిరుత్సాహ పడకుండా ఇలాంటి ఫోటో



షూట్స్ తో సందడి చేస్తోంది. తాజాగా ఎల్లో డ్రెస్ తో కళ్లు మిరుమిట్లు గొలిపే విధంగా అందంగా కనిపిస్తూ అదితి గౌతమ్ ఇచ్చిన అందాల ఫోటో షూట్ స్టిల్స్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ రేంజ్ అందాల ఆరబోతకు ప్రతి ఒక్కరు కూడా ఫిదా అవ్వాల్సిందే అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. కెరీర్ ఆరంభంలో ఎంత అందంగా ఉందో.. ఇప్పుడు కూడా అంతే అందంగా కనిపిస్తూ, అందాల ఆరబోత విషయంలో కూడా కొత్త హీరోయిన్స్ కి పోటీగా నిలుస్తున్న అదితి గౌతమ్ మళ్లీ ఇండస్ట్రీ లో బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి అంటూ ఈ ఫోటోలు చూసిన కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.




## విద్యుత్తు రంగంపై తెలంగాణ శాసనసభలో చర్చ

**రాష్ట్ర విద్యుత్తు రంగంపై శాసనసభలో చర్చ జరుగుతోంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి కరెంటు నిరంతర సరఫరాకు గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంది, తదితర వివరాలతో శ్వేతపత్రాన్ని సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని విద్యుత్ సరఫరా, ఉత్పత్తి గురించి ప్రజలకు తెలియాలని శ్వేతపత్రం విడుదల చేస్తున్నామని భట్టి తెలిపారు. జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలకు ఉన్న రూ.81 వేల కోట్ల రుణాలు, రూ.50 వేల కోట్లకుపైగా నష్టాలు, గత తొమ్మిదిన్నరేళ్లలో తీసుకున్న చర్యలను సభలో భట్టి వివరించారు.**


## అసెంబ్లీలో విద్యుత్‌పై శ్వేతపత్రం విడుదల చేసిన భట్టి విక్రమార్క




హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఆరో రోజు గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యుత్‌పై శ్వేతపత్రం విడుదల చేశారు. దీనిపై సభలో లఘు చర్చ జరగనుంది. రాష్ట్రానికి సంబంధించినంతవరకు ఏ రంగం అభివృద్ధి చెందాలన్న విద్యుత్ అవసరమని.. అలాంటి విద్యుత్ ఉత్పత్తి, ధీంట్లో ఇబ్బందులపై రాష్ట్ర ప్రజలకు వాస్తవ పరిస్థితులు తెలియాలనే ఆలోచనతో శ్వేత పత్రాన్ని ప్రవేశపెడుతున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పురోగతి, అభివృద్ధిలో విద్యుత్ రంగం కీలకపాత్ర పోషిస్తోందని భట్టి విక్రమార్క అన్నారు. పరిశ్రమల అభివృద్ధికి, వ్యవసాయ రంగం పురోగతికి, సేవారంగం అభివృద్ధికి నమ్మకమైన విద్యుత్ సరఫరాయే వెన్నెముకని అన్నారు. వైద్య రంగంలో అత్యవసర సేవలకైనా, రవాణా, సమాచార రంగాల మనుగడకైనా నాణ్యమైన విద్యుత్ సరఫరా చాలా ముఖ్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రజల నాణ్యమైన జీవన శైలిని సూచించేది కూడా విద్యుత్ అని ఆయన వ్యాఖ్యానించారు. మొత్తంగా చూస్తే ఆర్థిక, నిర్వాహణ పరంగా విద్యుత్ రంగం పరిపుష్టిగా ఉండడం రాష్ట్ర మనుగడకు చాలా అవసరమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి జెన్‌కోలో విద్యుత్ సామర్థ్యం 4,365.26 మెగావాట్లుగా ఉ ందిని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పాటు కన్నా చాలా ముందుగానే.. ఆనాటి నాయకుల ముందు చూపుతో తెలంగాణలో 2,960 మెగావాట్ల విద్యుత్ కేంద్రాలకు అవసరమైన ప్రణాళిక పనులు చేపట్టారన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉత్పతి ప్రారంభించిన కొత్త విద్యుత్ కేంద్రాలే తర్వాత కాలంలో తెలంగాణలో నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో కీలక పాత్ర పోషించాయన్నారు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం రూపకల్పన సమయంలోనే విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యానికి అదనంగా 18 వందల మెగావాట్ల విద్యుత్ వచ్చే విధంగా యూపీయే ప్రభుత్వం సోనియాగాంధీ నాయత్వంలో ప్రత్యేక నిబంధన చట్టంలో రూపొందించడం జరిగిందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం మొదలు పెట్టి పూర్తి చేసింది కేవలం 1080 మెగావాట్ల భద్రాద్రి థర్మల్ మాత్రమేనని ఈ ప్రాజెక్టులో ప్రమాణాలకు విరుద్ధంగా సబ్ క్రిటికల్ టెక్నాలజీ ఉపయోగించటం వల్ల పెట్టుబడి వ్యయం భారీగా పెరిగిందని భట్టి విక్రమార్క అన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ వ్యయంలో కేవలం బొగ్గు సరఫరాకు ఏడాదికి 800 కోట్లు అదనంగా అవుతుందని, రాష్ట్ర విద్యుత్ రంగ ఆర్థిక పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉందని, డిస్కంలు రూ. 81 వేల 516 కోట్ల నష్టాల్లో ఉన్నాయని, విద్యుత్ ఉత్పత్తి, సరఫరా సంస్థలకు రూ. 28,673 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వంలోని వివిధ శాఖలు రూ. 28,842 కోట్ల బకాయిలను డిస్కంలకు చెల్లించాల్సి ఉందని, రూ. 14,193 కోట్లు సాగునీటి శాఖ బకాయి ఉందన్నారు. విద్యుత్ కొనుగోళ్లలో ఇబ్బందులకు ఈ బకాయిలే ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వం రూ. 14,928 కోట్ల సర్దుబాటు ఖర్చులు చెల్లించక పోవటం డిస్కంల ఆర్థిక పరిస్థితిని కుంగ దీసిందని, దీంతో రోజువారి విద్యుత్ మనుగడకు భారీగా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్ని ఆర్థిక సవాళ్లు ఉన్న వాటిని అధిగమించి నాణ్యమైన విద్యుత్‌ను అందించటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## డిసెంబరు 27న యథావిధిగా సింగరేణి ఎన్నికలు



హైదరాబాద్: సింగరేణి కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు ఈ నెల 27న యథావిధిగా జరగనున్నాయి. డిసెంబరు 27లోగా ఎన్నికలను నిర్వహించాలని ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం అక్టోబర్‌లో ఉత్తర్వులు ఇచ్చింది.

అయితే, మరోసారి ఎన్నికలు వాయిదా వేయాలని హైకోర్టులో సింగరేణి కంపెనీ మధ్యంతర పిటిషన్ వేసింది. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఎన్నికలు వాయిదా వేయాలనే అభ్యర్థనను తోసిపుచ్చింది. దీంతో ముందుగా ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఈ నెల 27న ఎన్నికలు యథావిధిగా జరగనున్నాయి.

## శ్వేత పత్రాలు సభలో పెట్టి గెలుక్కున్నట్లు ఉంది



హైదరాబాద్: శ్వేత పత్రాలు సభలో పెట్టి గెలుక్కున్నట్లు ఉందని... తమను గెలికి తిట్టించుకుంటున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో నిర్వహిస్తున్న చిట్‌చాట్‌లో దానం మాట్లాడుతూ.. సభలో ప్రభుత్వం డిఫెన్స్‌లో పడిందన్నారు. పథకాలు ఆలస్యంగా అమలు చేయడానికే శ్వేతపత్రం అని మొదలు పెట్టారన్నారు. ప్రభుత్వం అప్పులు బయటపెడితే భవిషత్ ఇబ్బంది అవుతుందన్నారు. హరీష్ రావు, కేటీఆర్‌కు మంత్రుల కౌంటర్ సరిపోవడం లేదన్నారు. ఇరిగేషన్‌పై హరీష్ ఉతికి ఆరేస్తరన్నారు. మంత్రులు అసలు విషయాలు చెప్పకుండా పైపై వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. రేవంత్ పరిపాలనలో జాగ్రత్తగా వెళు తున్నారని.. సీఎం పదవి రేవంత్ చిరకాల వాంఛ అని అన్నారు. రేవంత్ .. అంత ఈజీగా వదులుకోరన్నారు. లక్ష్యం పెట్టుకుని.. రేవంత్ సీఎం అయ్యారని తెలిపారు. "రెండేళ్ల క్రితమే కాంగ్రెస్ సీనియర్‌లు రిటైర్డ్ అవుతరు. నేనే సీఎం అని చెప్పాడు. మా ఎమ్మెల్యేలు కొందరు ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారు. ఆరు నెలల్లో ప్రభుత్వం పడిపోతుంది అనడం సరికాదు.. కొత్త ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని కేసీఆర్ కూడా చెప్పారు" అని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు.

## మాజీ సీఎం ఎన్ని పార్టీలు మారారు?.. అసెంబ్లీలో రాజ్‌గోపాల్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్: అధికారంలో పర్మినెంట్‌గా ఉంటాం అనుకున్న బీఆర్ఎస్‌కు ప్రజలిచ్చిన షాక్‌కు మతిభ్రమించింది అని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. గురువారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ నేతల తీరు మారడం లేదన్నారు. పార్టీలు మారామని తమ బ్రదర్స్‌ను విమర్శిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎన్ని పార్టీలు మారారో తెలియదా? అని ప్రశ్నించారు. నాలుగు రూపాయలకు దొరికే పవర్‌ను ఆరు రూపాయలకు పెంచి గత ప్రభుత్వం తప్పు చేసిందన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ నాయకుల పరిస్థితి ఆలోచన చేస్తే జాలేస్తోందన్నారు. కిరసనాయిలు దీపం, కిరాయి ఇంట్లో ఉన్న మాజీ మంత్రి రూ.1000 కోట్ల రూపాయలు హైదరాబాదులో బంగ్లా, జిల్లాలో బంగ్లా ఎలా సంపాదించారని నిలదీశారు. తాను పార్టీలు మారింది ప్రజల కోసమే అనినను తాను పదవుల కోసమో, పైసల కోసమో పార్టీలు మారలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి ముందు ఆ పార్టీ నాయకులు మాట్లాడి ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి ముందు ధైర్యంగా మాట్లాడలేదు కాబట్టి రాష్ట్రం అప్పుల పాలు అయిందని రాజ్‌గోపాల్ రెడ్డి విమర్శలు గుప్పించారు.




## మంత్రి కోమటిరెడ్డి - జగదీశ్‌రెడ్డి.. విద్యుత్తు రంగంపై వాడివే'ఢీ'గా చర్చ

హైదరాబాద్: తెలంగాణలో విద్యుత్తు రంగం పరిస్థితిపై శాసనసభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మధ్య వాడీవే'ఢీ'గా చర్చ జరిగింది. యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులో పెద్ద కుంభకోణం జరిగిందని, రూ.10 వేల కోట్లను జగదీశ్‌రెడ్డి తిన్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. టెండర్ పెట్టకుండా ఇవ్వడమే పెద్ద కుంభకోణమని ఆరోపించారు. "భారాస సర్కారు 24 గంటల కరెంట్ ఎప్పుడూ ఇవ్వలేదు. సబ్‌స్టేషన్లలో లాగ్ బుక్‌లు చూస్తే ఇదంతా తెలుస్తుంది. నేను వెళ్లిన తర్వాత లాగ్ బుక్‌లు లేకుండా చేశారు. రూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగింది కాబట్టే నష్టాలు వస్తున్నాయి" అని కోమటిరెడ్డి అన్నారు. దీంతో తనపై వచ్చిన ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సభాపతిని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కోరారు. యాదాద్రి ప్రాజెక్టులో కుంభకోణం జరిగిందన్నది అవాస్తవమన్నారు. భారాస పాలనలో విద్యుత్ సరఫరా నాణ్యతను పెంచామన్నారు. అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్ అందించామని చెప్పారు. "మా హయాంలో అర ఎకరం కూడా ఎండలేదు. విద్యుత్‌పై ధర్నాలు చేసే అవకాశం మేం ఇవ్వలేదు.

మా హయాంలో ఒక్క రోజు కూడా పవర్ హాలిడే ఇవ్వలేదు. ఈ సభలో ఉన్న ప్రతి ఒక్కరికీ అప్పులు ఉన్నాయి. అప్పులు ఉన్నంత మాత్రన మనందరం చెడ్డవాళ్లమా? అప్పులు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు" అని జగదీశ్‌రెడ్డి సభకు తెలిపారు.




## షర్మిల ఆనందాన్ని పంచుకున్న కవిత..

హైదరాబాద్: వైఎస్సార్‌టీపీ వ్యవస్థాపకురాలు, ఆ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆనందాన్ని ఎమ్మెల్సీ కవిత పంచుకున్నారు. నిన్న షర్మిల కుమారుడు, కుమార్తె రాజారెడ్డి, అంజలిరెడ్డి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నారు. ఈ విషయాన్ని షర్మిల సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. దీనిపై ఎమ్మెల్సీ కవిత స్పందించారు. "రాజా, అంజలికి మీ గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా శుభాకాంక్షలు.

షర్మిల గారూ.. మీ పిల్లల అద్భుతమైన ఈ ప్రయాణంలో అడగడుగునా అండగా నిలిచి వారి సాధించిన ఉన్నతికి సాక్ష్యమైన మీ ఆనందం వెలకట్టలేనిదని ఒక తల్లిగా నేను కచ్చితంగా చెప్పగలను. మీ చిరునవ్వు మాదిరిగా వారి భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉ ంటుంది" అని కవిత పేర్కొన్నారు. వైఎస్సార్‌టీపీ వ్యవస్థాపకురాలు, ఆ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల కొడుకు రాజారెడ్డి, కూతురు అంజిలి రెడ్డి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా షర్మిల వెల్లడించారు. అప్లయిడ్ ఎకనామిక్స్ అండ్ ప్రిడిక్టివ్ అనలిటిక్స్‌లో మాస్టర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ సాధించిన కొడుకు రాజారెడ్డి, బీబీఏ ఫైనాన్స్ డిగ్రీ సాధించిన కూతురు అంజిలి రెడ్డికి ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఫేస్‌బుక్ వేదికగా షర్మిల పోస్టు పెట్టారు.

## ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టారు




హైదరాబాద్: కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్‌లో నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారన్నారు. నెలకు 4 వేల భృతి హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు నిరుద్యోగ భృతి పై మాట మార్చి.. ఇవ్వడం లేదని అసెంబ్లీలో ఆర్థిక మంత్రి ప్రకటించారని కడియం తెలిపారు. రైతులు రెండు లక్షల రుణం తీసుకోవాలని రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో చెప్పారని.. ధాన్యానికి మద్దతు ధరతో పాటు రు.500 బోనస్ ఇస్తామన్నారని కడియం పేర్కొన్నారు. ఈ మూడు హామీలపై కాంగ్రెస్ మాట తప్పిందన్నారు.




మియాపూర్ : పెద్దలు కుదిర్చిన వివాహం.. సుమారు 18 ఏళ్ల వైవాహిక జీవితం. వీరికి 17, 18 ఏళ్ల ఇద్దరు కుమారులున్నారు. వారు రాజేశ్వరి తల్లి వద్ద బోధన్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. ఆ కుటుంబంలో నెలకొన్న చిన్న వివాదం దారుణానికి దారితీసింది. భర్త భార్యను దారుణంగా హత్య చేశాడు. విచారణలో అసలు విషయం బయటపడింది. మియాపూర్ సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్సై గిరీష్ వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ వాసి రాజేశ్వరి(38)కి అదే జిల్లాకు చెందిన రుద్రురు మండల కేంద్రానికి చెందిన కార్పెంటర్ రాజేష్‌తో 2005లో వివాహమైంది. రాజేష్ బతుకుదెరువుకు వచ్చి మియాపూర్‌లో ఉంటున్నాడు. ఫంక్షన్ ఉందని తీసుకెళ్లి..: భార్యాభర్తల మధ్య కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఆమె అడ్డు తొలగించుకోవాలని ఈనెల 10న గండిమైసమ్మ ప్రాంతంలో ఓ ఫంక్షన్ ఉందని తనతో బైకుపై తీసుకెళ్లాడు. బౌరంపేట సమీపంలో ఔటర్ రింగ్‌రోడ్డు సర్వీస్ ప్రాంతానికి తీసుకెళ్లి తలపై రాయితో కొట్టి హత్య చేశాడు. మృతదేహాన్ని సర్వీస్ రోడ్డు పక్కనే ఉన్న కాల్వలో పడేసి ఇంటికి చేరుకున్నాడు. 12న మృతురాలి తల్లి, సోదరికి ఫోన్ చేసి రాజేశ్వరి కనిపించడం లేదని నాటకం మొదలుపెట్టాడు. మృతురాలి తల్లి 14న పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాజేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించడంతో హత్య వ్యవహారం వెలుగు చూసింది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని రాజేష్‌ను రిమాండ్‌కు తరలించారు.

## 23న టీపీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశం



హైదరాబాద్: ఈనెల 23న గాంధీభవన్ లో టీపీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశం జరుగనుంది. టీపీసీసీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన 12 గంటలకు ఈ సమావేశం జరుగనుంది. ఏఐసీసీ ఇంచార్జ్ మానిక్ రావ్ ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శులు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, పీఏసీ సభ్యులు, టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, డీసీసీ అధ్యక్షులు, ఫ్రంటల్ అధ్యక్షులు సమావేశంలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రకాశం హాలులో రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, అధికార ప్రతినిధులతో సమావేశం జరుగనుంది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com